వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 26 మే 2023

## పాల ట్యాంకర్ పేలి ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



రాయచోటి, మే 25(ప్రభాతవార్త):

రాయచోటి పట్టణం గాలివీడు రింగ్‌రోడ్ వద్ద గ్రానైట్ వద్ద గల విజయపాల శీతలీకరణ కేంద్రంలో పాలు నిల్వ ఉంచు ట్యాంకర్ పేలి జోగేంద్ర సింగ్ (32) అక్కడికక్కడే మృతి చెందగా నాగరాజు (45) తీవ్ర గాయాలయ్యారు. మృతి చెందిన జోగేంద్ర సింగ్ (32) మెహింద్ పూర్, హర్యానాకి చెందిన టెక్నీషియన్. క్షతగాత్రుడు నాగరాజు (45) చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్యాంకర్లలో నెలకొన్న శీతలీకరణ సమస్యను పరిష్కరించుటకు హర్యానా నుండి వచ్చిన జోగేంద్ర సింగ్ సమస్య పరిష్కరించు సమయంలో ట్యాంకర్‌లో గ్యాస్ ఒత్తిడి ఎక్కువ కావడంతో ట్యాంకర్ పేలడంతో జోగేంద్ర సింగ్ ట్యాంకులో ఉండడంతో మరణించారు. ట్యాంకర్‌లో ఉన్న మృతదేహాన్ని అగ్నిమాపక అధికారి వెంకటరామ్‌రెడ్డి వారి సిబ్బంది బయటకు తీశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలంలో ఎస్ఐ నరసింహారెడ్డి, వినయ్‌తుల్లాలు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను నెలలోగా ఇవ్వాలి

ట్రాన్స్‌కో కడప ఎస్ఇ ఎస్.రమణ

రాజంపేట అర్బన్, మే 25 ప్రభాతవార్త

రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం సొమ్ము చెల్లించిన నెల రోజుల్లోగా కనెక్షన్లు ఇవ్వాలని ఉమ్మడి కడప ట్రాన్స్‌కో ఎస్ఇ ఎస్.రమణ ఆదేశించారు. గురువారం రాజంపేట డివిజన్‌లో పర్యటించారు. రాజంపేట సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం డివిజన్ మీటింగ్‌లో అధికారులతో సమీక్షించారు. విద్యుత్తు సరఫరా, కనెక్షన్లు, అంతరాయం సేవలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం రైతులు డబ్బులు చెల్లించిన తర్వాత జాప్యం చేయకూడదని పేర్కొన్నారు. విద్యుత్తు బకాయిల వసూళ్లలో కూడా ఉదాసీనత సరికాదన్నారు. నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యుత్తు బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్న వినియోగదారులకు సరైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత సిబ్బందిపై కూడా ఉందన్న విషయాన్ని మరచిపోకూడదన్నారు. విద్యుత్తు సబ్‌స్టేషన్లలో కూడా తరచూ పరిశీలిస్తూ జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలని సూచించారు. డివిజన్‌లో పరిస్థితులపై ఇఇ చంద్రశేఖర్‌రెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో డిఇఇ ఎం.సురేంద్రనాథ్, భాస్కర్, మురళీధర్, డివిజన్‌లోని ఇంజనీర్‌లు పాల్గొన్నారు.

## హజ్‌యాత్రికులకు ఆదనపు భారం పడకుండా ప్రభుత్వం ఆర్థిక సాయం

రాష్ట్ర మైనారిటీ శాఖా మంత్రి అంజాద్‌బాషా



కడప మే 25, ప్రభాతవార్త

గురువారం కడప నూర్జహాన్ కల్యాణ మండపం వద్ద ముస్లిం అనాథ ఆశ్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ ఆధ్వర్యంలో.. జిల్లా నుండి హజ్ యాత్రకు వెళ్లే 180 మందికి వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖామంత్రి ఎస్.బి.అంజాద్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా ఈ ఏడాది గన్నవరం ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్ నుండి యాత్రికులను నేరుగా పవిత్ర హజ్ యాత్రకు పంపడం జరుగుతుందన్నారు. 7 జూన్, 2023 నుండి 19 జూన్, 2023 వరకు కొనసాగనున్న హజ్ యాత్రలో భాగంగా ప్రతి రోజూ 155 మంది యాత్రికులు హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. కొత్తగా ఎంబార్కేషన్ పాయింట్ వచ్చాక వివిధ ఎయిర్ లైన్స్ ఏపీ నుండి యాత్రికులను హజ్ కు తీసుకెళ్లి మళ్లీ హజ్ నుంచి ఏపీకి తీసుకువచ్చే విధంగా ఇప్పటికే టెండర్లు పిలవడం జరిగిందన్నారు. హైదరాబాద్, బెంగుళూరు ఎంబార్కేషన్ నుండి వెళ్లే ప్రతి ఒక్క యాత్రికుడి మీద రూ.80,000 అదనంగా భారం పడుతున్న పరిస్థితుల్లో.. కేంద్ర ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో.. ముస్లిం మైనారిటీల పక్షపాతి అయిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోద్భలంతో ప్రతి ఏటా యాత్రికుడిపై విమాన ప్రయాణానికి అయ్యే ఖర్చుకు అదనంగా ఒక్కొక్కరికి రూ. 80,000 ల చొప్పున రూ.14.51 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి.. మైనార్టీ సంక్షేమ శాఖ, హజ్ యాత్రికుల తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.

హజ్ యాత్రికుల కొరకు.. మదరసాలో వసతి ఏర్పాటు చేయనున్నట్లు.. అక్కడి నుండి యాత్రికులను లాగేజీతో నేరుగా ఎయిర్ పోర్టుకు తరలించేలా ఎయిర్ పోర్టు అథారిటీ అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. అదే విధంగా ఆర్టీసీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 4 ఏసీ బస్సుల ద్వారా యాత్రికులను మదరసా నుండి గన్నవరం ఎయిర్ పోర్టుకు పంపించే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. హజ్ యాత్రికుల సౌకర్యార్థం 24 గంటలు పనిచేసేలా మదరసా వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి అవసరమైన వారికి వ్యాక్సినేషన్ అందిస్తున్నామన్నారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, హజ్ కమిటీ వారు అందిస్తున్న సదుపాయాలను హజ్ యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కోరారు.

ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ మెంబర్ వలీవుల్లా హుస్సేన్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ముస్లిం మత పెద్దలు, మైనారిటీ, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంతృప్త స్థాయిలో ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి

కలెక్టర్లతో సమీక్షా సమావేశంలో ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి



కడప మే 25, ప్రభాతవార్త

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంతో పాటు.. ప్రజల నుండి అందే ఫిర్యాదులకు సంతృప్తి కరమైన పరిష్కా రాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుండి.. జగ నన్నకు చెబుదాం, హెల్త్, ఐసిడిఎస్ పరిధిలో ప్రభుత్వ పథకాలు మరియు ఎస్డిజి ఇండికేటర్స్, స్కూల్ ఎడ్యుకేషన్, గ్రామ, వార్డు సచివాలయాలు, స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం, తదితర అంశాలపై.. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి.. అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి.. కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు.. ట్రైనీ, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ గంగాధర గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ద్వారా.. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలనే లక్ష్యం మేరకు అధికారులు నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా.. సచివాలయ బిల్డింగులు, వైయస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు.. ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని, ప్రజల నుండి అందే స్పందన అర్జీలకు వేగవంతంగా, సంతృప్తి కారంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమావేశంలో.. డ్వామా, డిఆర్డీఏ, ల్యాండ్ సర్వే, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, సంక్షేమ, సర్వే, ఇంజనీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దముడియం నుంచి కొనసాగిన పాదయాత్ర

### 30న జమ్మలమడుగులో బహిరంగ సభ

జమ్మలమడుగు, మే 25, ప్రభాతవార్త:

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాద యాత్ర 110వ రోజు నియోజకవర్గ పరిధిలోని పెద్దముడియం మండలం, ఎన్.కొట్టాలపల్లె గ్రామం నుంచి ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైంది. పెద్ద పసుపుల జంక్షన్‌లో పెద్దముడియం గ్రామ రైతులు, పెద్ద పసుపులలో దళితులు, ప్రజలు, జమ్మలమడుగు బైపాస్‌లో ముస్లిం మైనార్టీలు లోకేష్‌ను కలిసి పలు సమస్యలను తెలిపారు. నారా లోకేష్ స్పందిస్తూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామీణాభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. జగన్ పాలనలో పేదలు, దళితుల ప్రాణాలు గాలిలో దీపంగా మారాయన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ వారి సంక్షేమాన్ని పూర్తిగా వదిలేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక దళితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కొన్ని చోట్ల పరువు కోసం సొంత డబ్బుతో పనులు చేసిన సర్పంచ్‌లు ప్రభుత్వం నుంచి బిల్లులు రాక ఆత్మ హత్యలు చేసుకుంటున్నారన్నారు. మైనార్టీలను కూడా విస్మరించారని గుర్తు చేశారు. నర్సరావుపేటలో మసీదు స్థలం కబ్జాను అడ్డుకున్న ఇబ్రహీంను దారు ణంగా నరికి చంపారన్నారు. జమ్మలమడుగు మైనార్టీ కమ్యూనిటీ హాలు, ఉర్దూ పాఠశాల, ప్రత్యేక శ్మశాన వాటిక నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉన్న బీడీ కార్మికులందరికీ ఉచితంగా పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు.



నాలుగు రోజులు యువగళం విరామం

గురువారం మధ్యాహ్నం యువగళం యాత్ర పెద్దపసుపుల రోడ్డులోని జమ్మల మడుగు బైపాస్ వద్ద 110వ రోజు ముగిసింది, 26, 27, 28, 29 తేదీల్లో యువగళం యాత్రకు విరామం ప్రకటించారు. మహానాడు కార్యక్రమం వలన ఈ యాత్ర ఆగినట్లు యువగళం మీడియా కోఆర్డినేటర్ తెలిపారు. ఇప్పటికి మొత్తం యాత్ర 1423.7 కి.మీ సాగిందని అందులో 110వ రోజు 12.3 కి.మీ చేపట్టడం జరిగిందన్నారు. 30న పున: ప్రారంభమవుతుందన్నారు. యువగళం యాత్రలో ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి, మల్లెల లింగారెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, ఉక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేజీ ఖదీర్, సయ్యద్ రఫీ, నజీర్, జీకే గైబు, బీసీ నాయకులు కొండయ్య, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాప ప్రక్షాళన దిశగా పయనిస్తున్న ఏపీఎండీసీ

- కార్యాలయాల్లో పెను మార్పులకు శ్రీకారం
- అక్రమాలకు చోట లేకుండా చర్యలు



ఓబులవారిపల్లె, మే 25, ప్రభాతవార్త:

మంగంపేట అంటే ప్రపంచ పటంలో సముచిత స్థానం కల్పించుకున్న ఒక గొప్ప సంస్థ ఏపీఎండీసీ అనే చెప్పవచ్చు. అయితే ప్రపంచాన్ని ప్రపంచ మార్కెట్‌ను శాశిస్తూ తనదైన శైలిలో గ్రావిటీ ఖనిజం విలువ ఇతర దేశాలతో పోలిస్తే మంగంపేట ముగ్గురాయికి ఎనలేని విలువ ఉంది. అయితే ఈ సంస్థలో కొందరు ధనాపేక్షతో అక్రమాలకు తెరలేపుతూ అందినకాడికి అక్రమార్గంలో పయనిస్తూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ముగ్గురాయి అక్రమ రవాణాలో కొంత మందికి శిక్షలు పడ్డా మరి కొందరు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడిన పెద్ద తలకాయలను వదిలేసి అక్కడ పనిచేస్తున్న చిరుద్యోగులపై వేటు వేశారనే విమర్శలు గుప్పిస్తున్నాయి. ఏది ఏమైనా నూతనంగా విధులు చేపట్టిన సీపీవో సుదర్శన్‌రెడ్డి తనదైన శైలిలో అక్రమాలు జరగకుండా ప్రాజెక్టులో ప్రక్షాళన చేపట్టి ఎప్పటికప్పుడు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా రాత్రింబవళ్లు ఓరు ఓబీ బ్లాస్టింగ్, వేబ్రిడ్జ్, తూకాలు స్టాక్ పాయింట్ల వద్ద పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు ఉద్యోగుల పట్ల డేగ కన్ను వేసి విధులు నిర్వహిస్తూ ప్రక్షాళన చేపడుతున్నారని పలువురు హర్షిస్తున్నారు. అంతేకాకుండా ఇకపై అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రాజెక్టులో పెను మార్పులు తెచ్చారు. అధికారులను విధుల పట్ల స్థాన చలనం చేయించడం జంబ్లింగ్ సిస్టం ప్రకారం వ్యాపారాలు, లారీలున్న ఉద్యోగులను మరోచోటికి బదిలీ చేయడం తదితర చర్యలు తీసుకున్నారు. అయితే కొంత మంది అక్రమ రవాణా కేసులో ఉన్నప్పటికీ కొందరు రాజకీయ పరపతి, నాయకుల అండదండలు ఉన్న వారి పేర్లను గోప్యంగా ఉంచి కొందరిపైనే చర్యలు తీసుకున్నారనే కార్మిక నాయ కులు, ప్రతిపక్ష నాయకుల వాదన ఒకలా ఉంటే అన్ని విధాలా చర్యలు తీసుకుం టున్నామని అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా విజిలెన్స్ తదితర అధికారు లతో విచారణ జరిగేటప్పుడు తప్పు చేసిన వారు శిక్షార్హులవుతారని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సంస్థలో కొందరు వివిధ శాఖలలో జంబ్లింగ్, బిల్డింగ్, బ్లాస్టింగ్, జియాలజీ, అకౌంట్స్, మైనింగ్ తదితర సెక్షన్లలో విధులు చేస్తున్న వారిపై ముగ్గురాయి అక్రమ రవాణాలో సంబం ధాలు న్నట్లు ఆరోపణలున్నాయి. ఎక్కడ చూసినా మంగంపేటలో వీరిపై గుసగుస లు వినిపిస్తున్నాయి. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరో న్యాయం అంటూ వీరి వెనక ఉన్న సూత్రదారులను గుర్తించి చట్టబద్ధమైన చర్యలు తీసుకొని సంస్థకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్థిక విశ్లేషకులు, కార్మిక నాయకులు, ప్రతిపక్ష నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

## మదనపల్లె-బెంగళూరు జాతీయరహదారిపై ప్రమాదం

# 63 మందికి గాయాలు

కారును ఢీకొని బోల్తా పడ్డ ప్రైవేటు బస్సు

క్షతగాత్రులను మదనపల్లెజిల్లా ఆస్పత్రికి తరలింపు







మదనపల్లెక్రైం, మే 25 ప్రభాతవార్త :

మదనపల్లె - బెంగళూరు జాతీయ రహదారిపై ఘోరప్రమాదం జరిగింది. బెంగళూరు నుంచి మదనపల్లె వైపు వస్తున్న ప్రైవేటు బస్సు, యూటర్న్ తీసుకుం టున్న కారును ఢీకొంది. దీంతో ప్రైవేటు బస్సు అదుపుతప్పి 15అడుగుల లోయ లో బోల్తా పడింది. ఈప్రమాదం సమయంలో 60 మందికి పైగా ప్రయాణి కులు బస్సులో వుండగా అందరూ గాయపడ్డారు. వీరిలో 5 మంది తీవ్రంగా గాయపడ టంతో వారిని తిరుపతి, బెంగళూరులకు తరలించి చికిత్సలు చేయిస్తు న్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటన సంఘటన స్థలంకు చేరుకుని క్షతగాత్రులను 108 వాహనాల్లో మదనపల్లె జిల్లాఆస్పత్రికి తరలించారు. మదనపల్లె డిఎస్పీ, సిఐల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. యలహంక నుంచి తిరుపతికి వెళ్లాల్సిన ప్రైవేటు (భారతి) బస్సు ఉదయం బయలుదేరింది. 10 గంటలకు మదనపల్లె చేరుకోవాల్సిన బస్సు 9.45 గంటల సమయంలో మదనపల్లె రూరల్ మండలం చీకలబైలు పంచాయితీ బార్లపల్లి సమీపంలోని మర్రిమాను వద్దకు చేరుకుంది. ఆదే సమయంలో నలుగురు యువ కులు బెంగళూరు నుంచి మదనపల్లెకు వస్తూ తిరిగి బెంగళూరుకు వెళ్లాలని నిర్ణ యించుకుని కారును యూటర్న్ చేస్తుండగా, వేగంగా వచ్చిన ప్రైవేటు బస్సు కారును ఢీకొని పలుమార్లు పల్టీ కొడుతూ పక్కన వున్న 15 అడుగుల లోయలో పడింది. బస్సులో వున్న అందరూ గాయపడ్డారు. కారులో వున్న యువకులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదంలో బస్సులో వున్న మదనపల్లె, బెంగళూరు, తంబళ్లపల్లి, రాయచోటి, పీలేరు, కదిరి తదితర ప్రాంతాలకు చెందిన రుషిత (3), క్రిష్ణప్ప (35), రామ్మోహన్ (25), లావణ్య (30), బయమ్మ (50), గిరిష్‌రెడ్డి (39), షమీమ్ (45), మమత (30), పవన్‌కుమార్ (39), ఇస్మాయిల్ (80), నీలిమా (45), రెడ్డి (8), అమృత (28), ఆనంద్ (28), రమణప్ప (33), స్వాతి (21), నిర్మల (57), వెంకటలక్ష్మి (50), శంకర (38), శాంతమ్మ (50) సత్యకుమార్ (27)లతో పాటు మరో 20మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన అందరిని 108 వాహనాల్లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో రుషిత, క్రిష్ణప్ప, రామ్మోహన్, లావణ్య, బయ మ్మ, గిరిష్‌రెడ్డిలకు తీవ్రగాయాలు కావటంతో వారిని బెంగళూరు, తిరుపతి ఆస్పత్రులకు రెఫర్ చేశారు. మిగిలిన వారికి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోనే చికిత్స లు కొనసాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న మదనపల్లె డిఎస్పీ, తాలుకా సిఐ సత్యనారాయణ, సిబ్బంది సంఘటన స్థలంకు చేరుకుని పరిశీలించారు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

### ప్రమాద ఘటనపై ఆరా తీసిన ఎంపి పెద్దిరెడ్డిమిథున్‌రెడ్డి

బస్సు ప్రమాద ఘటనపై ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆరా తీశారు. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్‌కు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గాయపడిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం...ఆర్డీవో మురళి

బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆర్డీవో మురళీ తెలిపారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఆర్డీవో జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన 108 సిబ్బందిని, చికిత్సలు అందిస్తున్న వైద్యులను ఆర్డీవో అభినందించారు.

### బస్సు ప్రమాద ఘటనపై లోతైన దర్యాప్తు చేస్తాం...డిఎస్పీ



మదనపల్లె - బెంగళూరు జాతీయ రహదరిపై జరిగిన బస్సు ప్రమాద సంఘటనపై లోతైన దర్యాప్తు చేస్తామని డిఎస్పీ కేశప్ప తెలిపారు. బస్సు ప్రమాదంలో ఎవరూ చనిపోలేదని, గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించటం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### పలువురు పరామర్శ....

బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పలువురు రాజకీయ నాయకులు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎఐఎండిసి ఛైర్మన్ గుండ్లూరి షమీంఅస్లాం, మున్సిపల్ ఛైర్మన్ మనూజారెడ్డి, వైస్ ఛైర్మన్ జింకా వెంకటాచలపతి, జనసేన నాయకులు రామ్‌దాస్‌చౌదరి, జంగాలశివరాం తదితరులు పరామర్శించారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

- వ్యవసాయ సంబంధిత పనిముట్ల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి





లక్కిరెడ్డిపల్లె, మే 25, ప్రభాతవార్త:

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలో జరిగిన ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన డబ్ల్యూడీసీ, పీఎంకేఎస్‌వై 2.0 జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఉత్పాదక పెంపుదల నిధులతో మంజూరైన లక్కిరెడ్డిపల్లె మండలంలోని బి.ఎర్రగుడి డబ్ల్యూసీసీ ప్రాజెక్టు పరిధిలోని రైతులకు వ్యవసాయ సంబంధిత పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే స్ప్రేయర్లు, పీవీసీ పైపులు, ఆయిల్ ఇంజిన్లు, తార్పాలిన్ పట్టలు, గడ్డి కత్తిరించే చాప్ కట్టర్లు తదితర పరికరాలను వాటర్ షెడ్ ద్వారా అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు సమయాన్ని ఆదా చేస్తూ సకాలంలో వ్యవసాయ పనులను పూర్తి చేసేందుకు దోహదం చేస్తాయన్నారు. వ్యవసాయ సాగు ఖర్చులను తగ్గించడంలో సహాయపడతా యన్నారు. పంటల దిగుబడి మరియు ఉత్పాదకతను పెంచుతూ వ్యవసాయ పనుల సామర్థ్యాన్ని పెంచుతాయన్నారు. వ్యవసాయ కూలీల శారీరక శ్రమను, కూలీల కొరత, ఖర్చులను తగ్గించుటకు తోడ్పడతాయన్నారు. వాటర్ షెడ్ ప్రాజెక్టుల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు 90% సబ్సిడీ, ఓబీసీ రైతులకు 80% సబ్సిడీతో రైతులకు యంత్ర పరికరాలను అందిస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె మండలం బి.ఎర్రగుడి, గాలివీడు మండలం గుండ్లచెరువు వాటర్‌షెడ్ ప్రాజెక్టుల పరిధిలో మొదటి విడతగా 796 మంది రైతులకు రూ.1,51,92,586 విలువ గల వ్యవసాయ పరికరాలు మంజూరయ్యా యన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలను వాటర్ షెడ్ పరిధిలోకి చేర్చాలని డ్వామా పీడీ మద్దిలేటి, వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మీ నరసయ్యలు, పీవో అశోక్‌రెడ్డిలకు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, జడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఉప మండలాధ్యక్షులు సమరసింహారెడ్డి, గంగమ్మ ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి, వైసీపీ నాయకులు గజేంద్రరెడ్డి, సుబ్బరాయుడు, విజయ్ భాస్కర్, రవి, ఆచారి, సుబ్బరాజు, ఉపసర్పంచ్ రాజారెడ్డి, వాటర్ షెడ్ సిబ్బంది, వాటర్ షెడ్ కమిటీల ఛైర్మన్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎంటీఎస్‌ల ద్వారా189 మొబైల్‌ఫోన్లు రికవరీ

- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడి



కడప క్రైం, మే 25, ప్రభాతవార్త:

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం (ఎంఎంటీఎస్) విధానాన్ని వాట్సాప్ నెం 9392941541 ప్రారంభించిన అతి తక్కువ సమయంలో దశల వారీగా రూ.1.75 కోట్ల విలువైన 669 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. అతి తక్కువ కాలంలోనే ఫోన్లు రికవరీ చేసి తమకు అందజేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా గురువారం కడపలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో రూ.45లక్షలు విలువైన 189 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతుల మీదుగా బాధితులకు అప్పగించారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీకి బాధితులు థ్యాంక్యూ.. ఎస్పీ సార్ అంటూ ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను దశల వారీగా రికవరీ చేసి ఇచ్చామన్నారు. పోలీసు స్టేషన్‌కు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెళ్లకుండా ఎఫ్ఐఆర్ నమోదు లేకుండా వారికి సెల్‌ఫోన్లు తిరిగి అందజేయాలనే సంకల్పంతో గత ఏడాది డిసెంబరు 1న ఎంఎంటీఎస్ (మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం) ఉచితంగా వెబ్‌సైట్ సేవలను ప్రారంభించామన్నారు. ప్రజలకు మరింత సులువైన సేవలు అందించడానికి చాట్ బాక్స్ ద్వారా 9392941541 సేవలను ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 5వేల మొబైల్ మిస్సింగ్ ఫిర్యాదులు రాగా ఎంఎంటీఎస్ ద్వారా ప్రస్తుతం దాదాపు రూ.45లక్షల విలువైన 189 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఎస్పీ అందజేశారు. మిగిలిన ఫోన్లను కూడా రికవరీ చేసి బాధితులకు అందజేస్తామని ఎస్పీ తెలిపారు. సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారు వెంటనే 1930 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. తద్వారా ఫోన్‌కు లింకు అయి ఉన్న బ్యాంక్ అకౌంట్‌ను కూడా ఎలాంటి డబ్బులను పోగొట్టుకోకుండా ముందు జాగ్రత్తగా తమకు వచ్చే మెయిల్ ఆధారంగా ఫ్రీజ్ చేస్తామన్నారు. అలాగే సరైన బిల్లులు లేకుండా ఫోన్లు కొనుగోలు చేయరాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడి పర్యవేక్షణలో మొబైల్ ఫోన్ల రికవరీలో శ్రమించిన సైబర్ క్రైం టెక్నికల్ విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌నాయుడు, ఎస్సైలు మధుమల్లేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

## చెట్టుపై నుంచి కింద పడి వ్యక్తి మృతి

కడప క్రైం మే 25, ప్రభాతవార్త:

కడప నగరంలోని తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని నబీకోటలో ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చెట్టుపై నుంచి కింద పడిన ప్రమాదంలో మౌలాలీ(35) అనే వ్యక్తి మృతి చెందాడు. అతని భార్య షాజిదా తెలిపిన వివరాల మేరకు కడప నగరం నబీకోటకు చెందిన మౌలాలీకి ఇద్దరు సంతానం. కూలీ పని చేసుకొని జీవనం సాగించేవాడు. గురువారం ఉదయం సంఘటనా స్థలంలో చెట్టును ఎక్కి కొమ్మలను నరుకుతుండగా కాలు జారి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలిపారు.

## ఘనంగా గంగమ్మ జాతర మహోత్సవం

### దర్శించుకున్న కొరముట్ల తదితరులు

చిట్వేలి, మే 25 ప్రభాతవార్త



చిట్వేలి మండల పరిధిలోని కెఎస్ అగ్రహారం నందు గ్రామదేవత గంగమ్మ జాతర మహోత్సవం గురువారం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన జాతర గురువారం సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది. చిట్వేలి మండల పరిధిలోని గ్రామ ప్రజలు పెద్దఎత్తున జాతరలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వవిప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు స్థానిక వైసిపి నాయకులతో కలిసి శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తాను తెలిపారు. సాయంత్రం యెడ్లబండ్లు, సాంస్కృతి కార్యక్రమాలు గ్రామ ప్రజలు పెద్దఎత్తున చేపట్టారు. ఎలాంటి వివాదాలు తలెత్తకుండా స్థానిక ఎస్ఐ సుభాస్‌చంద్రబోస్ తమ సిబ్బందితో కట్టుదిట్టమైన ఏర్పాట్లు గావించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు ఎల్‌వి మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, మోసాటి రాముడు, చెంగల్ రాయుడు, సర్పంచ్ ప్రసాద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## మన్నూరు లెప్రసి యూనిట్ దత్తత

### పౌష్టికాహారాన్ని పంపిణీ చేసిన వైద్యులు

రాజంపేట అర్బన్, మే 25 ప్రభాతవార్త

ప్రధానమంత్రి టిబి ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాజంపేట పట్టణం మన్నూరు అర్బన్ హెల్త్ సెంటర్‌ను రాజంపేట పెన్షనర్ల అసోసియేషన్ దత్తత తీసుకుంది. అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని టిబి పేషంట్లకు 6 నెలల పాటు పౌష్టికాహారాన్ని పంఇణీ చేసే కార్యక్రమాన్ని రాజంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ చిన్నిక్రిష్ణ గురువారం ప్రారంభించారు. ఇతర సెంటర్లకు స్ఫూర్తిగా నిలిచిన రాజంపేట పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి పిచ్చయ్యను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వికాస్, డాక్టర్ అశోక్, సూపర్‌వైజర్‌లు జయప్రకాష్, యుడిసి సిద్దిరామయ్య, శివరాం, నీరజ తదితరులు పాల్గొన్నారు.

## రెండు స్కూటర్లు ఢీ ... మహిళకు తీవ్ర గాయాలు



రామాపురం, మే 25ప్రభాతవార్త:

కర్నూలు-చిత్తూరు 40వ జాతీ య రహదారిలో రామాపురం మం డలం కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురంలో గురు వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు స్కూటర్లు ఢీకొని రుక్మిణి అనే మహిళకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త రోడ్డు నారాయణపురానికి చెందిన రుక్మిణి మరో వ్యక్తి ఎపి04 బిటి 3969 గల నెంబర్ గల స్కూటర్‌లో గువ్వల చెరువు నుంచి ఇంటికి వస్తుండగా కొత్తరోడ్డు నారాయణపురం సమీపానికి వచ్చిన క్రాస్ అవుతుండగా కడప వైపు నుంచి నూలివీడు వెళ్తున్న స్కూటలిస్టు ఢీకొంది. ఈ సంఘటనలో మహిళకు చెయ్యికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి హైవే పోలీసులు చేరుకొని చికిత్స నిమిత్తం 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లి ప్రభు త్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

## క్రికెట్ బెట్టింగ్ మహమ్మారికి యువకుడు బలి

- కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు
- శోకసంద్రంలో దయ్యాలపల్లి

బి.కొత్తకోట, మే 25, ప్రభాతవార్త:



అవసాన దశలో తల్లిదండ్రులను పోషించాల్సిన కొడుకు క్రికెట్ బెట్టింగ్ మహమ్మారి బారిన పడి బలవన్మరణానికి పాల్పడిన విషాదకర సంఘటన బి.కొత్తకోట మండలంలో వెలుగు చూసింది. బి.కొత్తకోట ఎస్సై రామ్మోహన్ వివరాల మేరకు మండలంలోని సూరపగారి పల్లె పంచాయతీ దయ్యాలవారిపల్లెకు చెందిన జయరామిరెడ్డి, శ్యామలది మధ్య తరగతి రైతు కుటుంబం. వీరికి శ్రావణ కుమార్‌రెడ్డి(24), హారిక ఇరువురు సంతానం. కుమారుడు ఉన్నత స్థాయికి చేరి తమను పోషిస్తాడని ఆశతో తల్లిదండ్రులు శ్రావణ్‌కుమార్‌రెడ్డిని రేయింబవళ్లు కష్టపడి చదివించాడు. వారి ఆశయం మేరకు శ్రావణ్‌కుమార్‌రెడ్డి బీటెక్ వరకు చదివి ప్రయోజకుడయ్యాడు. ఉద్యోగ అన్వేషణలో భాగంగా హైదరాబాదు చేరుకొని అక్కడ క్యాబ్ జెమినీ అనే ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. సజావుగా ఉద్యోగం చేసుకుంటున్న శ్రావణ్ కుమార్‌రెడ్డి హైదరాబాదులో బెట్టింగ్‌ల మాయలో పడి ఈ అప్పులు తీర్చడానికి లోన్ యాప్‌లను కూడా ఆశ్రయించాడు. రూ.4 లక్షలు వరకు అప్పు చేశాడు. అవి తీర్చలేక తీవ్ర మనస్థాపం చెందాడు. విషయం తెలుసుకున్న శ్రావణ్ తల్లిదండ్రులు అప్పులు తీర్చడానికి సిద్ధమయ్యారు. ఇంతలోనే రుణగ్రస్థుల ఒత్తిడి ఎక్కువ కావడంతో శ్రావణ్ కుమార్‌రెడ్డి గురువారం ఉదయం మొరం పల్లిలోని పూతమల్లేశ్వర స్వామి ఆలయం లోని గ్రిల్స్‌కు టవల్‌తో ఉరి వేసుకొని మృత్యువాత పడ్డాడు. ఈ సంఘ టన జయరామిరెడ్డి దూరపు బంధువు రెడ్డప్పరెడ్డి మృతి విషయం తల్లిదండ్రు లకు తెలిపారు. విషయం తెలుసుకున్న జయరాంరెడ్డి కుటుంబ సభ్యులు సంఘ టనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరు గా విలపించారు. పోషించాల్సిన ఒక్కగా నొక్క కుమారుడు కళ్లెదుటే శవమై కనపడదంతో ఇక మాకు దిక్కెవరు నాయనా అంటూ రోధించడం అక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరినీ కంట కన్నీరు ఒలికింది. విషయం తెలుసుకున్న ఎస్సై రామ్మోహన్ సంఘట నా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత లోన్ యాప్ ద్వారా రుణం తీసుకొని అవి చెల్లించలేక మానసికంగా కృంగి పోయి ఇలాంటి ఘటనలకు పాల్పడుతుండడం విచారకరమన్నారు. యువత క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చకూడదని హితవు పలికారు.

## వైవీయూ పిహెచ్‌డీలో ప్రవేశాల కోసం దరఖాస్తులు

వైవీయూ మే 25, ప్రభాతవార్త

యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించే జాతీయ స్థాయి పరిశోధక పరీక్షలలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి పీహెచ్డీ లో ఫుల్ టైం ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు యోగి వేమన విశ్వవిద్యాలయం కుల సచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య తెలిపారు. యు జి సి - నెట్ / యు జి సి - సిఎస్ఐఆర్/నెట్ - సిఈఈడిలో ఫెలోషిప్ /స్కాలర్‌షిప్ కు అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అర్హులన్నారు. దరఖాస్తు స్వీకరణ గడువు ఈ ఏడాది జూన్ 12వ తేదీ కి ముగుస్తుందన్నారు. అప్లైడ్ మ్యాథమెటిక్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, ఎర్త్ సైన్సెస్, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్, జియాలజీ, మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నా లజీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, సైకాలజీ, సైకాలజీ, ఎంసిఎ జంతుశాస్త్రం, సైకాలజీ, కామర్స్, ఎకనామిక్స్, ఇంగ్లీష్, ఫైన్ ఆర్ట్స్, తెలుగు, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్ మేనేజ్మెంట్ సబ్జెక్టులలో పీహెచ్డీకి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారాలను వెబ్‌సైట్ (yvu.edu.in) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం జనరల్ విద్యార్థు లకు రూ.2 వేలు, ఎస్‌సి, ఎస్‌టి, పిహెచ్ సి విద్యార్థులు రూ .1300 చెల్లించా లన్నారు. వైయస్సార్ జిల్లా కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. రిజర్వేషన్ విధానం, ప్రతిభను అనుసరించి ఎంపికలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం 798920818/ 8317532040 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## లారీ స్కూటర్ ఢీ - ఇద్దరికి గాయాలు

మైదుకూరు మే 25, ప్రభాతవార్త



మైదుకూరు - ప్రొద్దుటూరు రోడ్డు బైపాస్ బ్రిడ్జి దగ్గర గురు వారం మైదుకూరు నుండి నంద్యాల వైపు వెళు న్న లారీ, మైదుకూరు నుండి ప్రొద్దుటూరు వెళ్తున్న స్కూటర్ ఢీ కొనడంతో స్కూటర్‌పై వెళ్తున్న యల్. వీరారెడ్డి, లింగందీన్నెపల్లె, 2, అమరనాథ్ రెడ్డి, పోరుమామిళ్లకు గాయాలయ్యాయని 108 అంబులెన్సులో కడప రిమ్స్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

## ముగ్గురు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

### - రూ.60వేలు నగదు స్వాధీనం

ప్రొద్దుటూరు క్రైం, మే 25, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు టు టౌన్ పరిధిలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ ఇబ్రహీం తెలిపారు. ఆయన వివరాల మేరకు తమకు రాబడిన సమాచారం మేరకు మూడురు ఎక్స్ రోడ్ వద్ద క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న దువ్వూరుకు చెందిన వెంకట నరసింహ గౌడ్, సుబ్బారెడ్డి మరియు ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన హరినారాయణను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి రూ.60వేలు నగదు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మన ఊరు సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం

కమలాపురం, మే 25, ప్రభాతవార్త:



వేసవి కాలంలో ప్రయాణికులు, పాదాచారులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ పంపిణీ అభినందనీయమని పలువురు ప్రయాణికులు అన్నారు. గురువారం మన ఊరు సేవా సమితి అధ్యక్షుడు శీలం శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక మూడు రోడ్ల కూడలి సమీపాన మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆటో ప్రయాణికులకు, పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేయగా నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ మన ఊరు సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వేసవి కాలంలో మంచి నీటి చలివేంద్రాల ఏర్పాటు మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మన ఊరు సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మహాసభ విజయవంతానికి అభినందనలు

### - జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, రాజశేఖర్

కడప వైద్యవిభాగం, మే 25, ప్రభాతవార్త:

విజయవాడలో జరిగిన 27వ ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూని యన్ రాష్ట్ర మహాసభకు కడప జోన్‌లోని నలుమూలల నుంచి సుమారు 3 వేలకు పైగా హాజరై ఎంతో ఉత్సాహంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి జోనల్ అధ్యక్షులు కె.కె.కుమార్, జోనల్ కార్యదర్శి రాజశేఖర్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర అధ్య క్ష, కార్యదర్శులుగా పలిశెట్టి దామోదర్‌రావు, నరసయ్యను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గూడూరు సుబ్రమణ్యం, రాజును, ఉప ప్రధాన కార్యదర్శిగా ఆవుల ప్రభాకర్‌ను ఎన్నుకొనేందుకు సహకరించిన యూనియన్ సభ్యులందరికీ నాయకు లకు పేరు పేరునా జోనల్ కమిటీ తరుపున అభినందనలు తెలిపారు.

## బదిలీల ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంచాలి

కడప ఎడ్యుకేషన్, మే 25, ప్రభాతవార్త:

ఉపాధ్యాయ బదిలీల ఆన్‌లైన్ దరఖాస్తు నమోదులో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నందున దరఖాస్తు చేసుకొనుటకు ఉన్న గడువును 28 వరకు పెంచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్ బాబు, కడప, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ అలీఖాన్, చెంగలరెడ్డి, విద్యా శాఖను కోరారు. 2015లో బదిలీలకు నోచుకున్న వారి స్ప్రౌజ్ పాయింట్లు నమోదు కావడం లేదన్నారు. మొత్తం సర్వీస్‌కు డెసిమల్స్‌లో పాయింట్లు రావడం లేదన్నారు. 2001-02 డీఎస్సీకి చెందిన వారికి ఈ సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. ఓల్డ్ స్టేషన్ పాయింట్ల విషయంలో గందరగోళం నెలకొని ఉందన్నారు. ఇంకా అనేక రకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నందున తక్షణమే విద్యాశాఖ నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు.

## శ్రీశ్రీశ్రీ క్షేత్రపాలక కాలభైరవ స్వామి 13వ వార్షికోత్సవంలో పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం, మే 25, ప్రభాతవార్త:



కమలాపురం మండలం పందిళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ క్షేత్రపాలక కాలభైరవ స్వామి ఆలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అంకిరెడ్డిపల్లి చిన్న ఓబుల్ రెడ్డి భార్య అక్కమ్మ, కుమారులు ఎ.ఓబుల్‌రెడ్డి, ఎ.మహేశ్వరరెడ్డి, వారి మేనల్లుడు లెక్కల శ్రీని వాసులు రెడ్డిలు, గ్రామస్థులు నరసింహారెడ్డి, రవిరెడ్డి, మాజీ ఎంపీటీసీ, వంట మాస్టర్ వెంకట సుబ్బయ్య యాదవ్, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 110వ రోజుకు యువగళం పాదయాత్ర

కడప వైద్యవిభాగం, మే 25, ప్రభాతవార్త:



జమ్మలమడుగు నియోజకవర్గం లోని ఎన్.కొత్తపల్లి నుంచి పెద్ద పసుపుల మీదుగా జమ్మలమడుగు బైపాస్ వరకు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టీడీపీ నేతలు కోయలకుంట శ్రీనివాస్, నబీకోట శ్రీనివాసులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, తెదేపా రాష్ట్ర సభ్యులు పద్మశాలీ సాధికార సమితి, మాసా కోదండ రామ్, పాల్గొన్నారు.

## కండక్టర్ ఆంజనేయులు కుటుంబానికి అండగా ఉంటాం

### ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు మే 25, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు డిపోలో ఆర్టీసి కండక్టర్‌గా పని చేస్తూ ఈ నెల 24న విజయవాడలో జరిగిన ఏపిపిటీడీ (ఆర్టీసీ)ఎంప్లా యీస్ యూనియన్ రాష్ట్ర మహా సభకు హాజరై గుండె పోటుతో అకాలమరణం చెందిన అంపావతిన ఆంజనేయులు అంతిమయాత్రలో ఏపిపిటిడి (ఆర్టీసీ)ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రనాయకులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య, జోనల్ కార్యదర్శి యన్.రాజశేఖర్, కడపజిల్లా కార్యదర్శి ఏ.ఆర్.మూర్తి గురువారం పాల్గొన్నారు. ప్రొద్దుటూరు డిపో కమిటీ ఆధ్వర్యంలో గణనివాళులు అర్పించి వారి కుటుంబానికి యూనియన్ రాష్ట్రకమిటి తరుపున లక్షరూపాయలు ఆర్థిక సహాయం చేశారు. విజయవాడ నుండి ప్రొద్దుటూరుకు మృతదేహాన్ని తరలిం చేందుకు 25 వేలు రూపాయలను కూడా యూనియన్ తరుపున చెల్లిండం జరిగిందని ప్రొద్దుటూరు డిపో ఆర్టీసి ఇయు అధ్యక్ష,కార్యదర్శులు డి.గోపాల్, బి.సి.శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసి సంస్థపరంగా, ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని సేటిల్ మెంట్స్ తొందరగా వచ్చేలా అలాగే కుటుంబసభ్యులలో ఒకరికి ఉద్యోగం కూడా త్వరితిగతిన వచ్చేలా కృషిచేస్తా మని హామీ ఇస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

## లోకేష్‌కు ప్రొద్దుటూరులో పాదయాత్ర చేసే నైతిక హక్కులేదు

### ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు మే 25, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు నియోజక వర్గంలో నారా లోకేష్ పాదయాత్ర చేసే ముందు గత చంద్రబాబు పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజలకు స్పష్టం చేసి పాదయాత్ర చేపట్టాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అస్త్రాలు సంధిం చారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ చైర్పర్సన్ చాంబర్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో త్వరలో జరగ నున్న లోకేష్ పాదయాత్రపై ఆయన మూడు ప్రశ్నలను సూటిగా సంధించారు. గత చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ప్రొద్దుటూరు నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చారో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. డ్వాక్రా రుణమాఫీ రైతు రుణమాఫీ ఇల్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇంటి నిర్మాణాలు ఏ మేరకు చేపట్టారో ప్రజలకు చెప్పగలవా అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన నెరవేరని హామీలు ఏంటో ప్రజలకు వివరించగలవా అని ప్రశ్నించారు. నారా లోకేష్ స్థానిక ఎమ్మె ల్యేలను టార్గెట్ చేస్తూ వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ పాదయాత్ర కొనసాగించడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీ దేవి నాగరాజు వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి : జెవివి

ప్రొద్దుటూరు అర్బన్ మే 25, ప్రభాతవార్త

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండా లని జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డా. ఆనంద్ బాబు అన్నారు. జనవిజ్ఞానవేదిక అధ్యక్షుడు డా. శివారెడ్డి ఆధ్వర్యంలో జెవివి సమ్మర్ క్యాంప్ విద్యార్థులు గురువారం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిని సందర్శిం చారు. 6నుంచి 10వ తరగతి విద్యార్థులు వైద్య విభాగాలు, పరికరాలు, చికిత్స మొదలైన విషయాలపై అవగాహన పెంపొందించుకునేలా ఈ కార్యక్రమం జరిగింది. డా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తమ ఆరో గ్యం పట్ల శ్రద్ధ పెరుగుతుందని అది ఇప్పుడు ఎంతగా అవసరమో చెప్పారు. వివిధ విషయాల పట్ల వైద్యులు విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమం ద్వారా తాము ఆరోగ్య పరిరక్షణ ప్రథమ చికిత్స, వైద్య విధానం గురించి చాలా విషయాలు ప్రత్యక్షంగా తెలుసు కోగలిగామని విద్యా ర్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఇటువంటి ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యార్థులు దేన్నయినా సులువుగా అర్థం చేసుకోగలరని వారిలో సృజ నాత్మకత పెరుగుతుందని జనవిజ్ఞాన వేదిక సభ్యులు అభిప్రా యపడ్డారు. దాదాపుగా నెల రోజుల నుంచి వారు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ద్వారా 100 మందికి పైగా విద్యార్థులు పలు శాస్త్ర సాంకేతిక విషయాలను నేర్చుకుం టున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధాన కార్యదర్శి సునీత, కార్యదర్శి కళ్యాణ్ కృష్ణ, కో ఆర్డినేటర్స్ హాసిని, అక్షయ, భరత్, జాహ్నవి, యోచిత, నిఖిల్ తేజేష్, జావీద్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపులో ఇంగ్లీషు గ్రామర్ బోధన

ప్రొద్దుటూరు మే 25, ప్రభాతార్త



ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ స్కూలు నందు గురువారం నిర్వహించిన సమ్మర్ క్యాంపులో భాగంగా విశ్రాంత వైమానికదళ అసిస్టెంట్ ఇంజనీరు యం. వెంకట కొండయ్య హాజరై విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్ ను బోడిం చారు. ఇంగ్లీషు భాషని నేర్చుకోవాలంటే పునాది అయిన గ్రామర్ నేర్చు కోవాలని గ్రామర్లో వాక్యనిర్మాణం ఎలా చేయాలో నియమాలుంటాయని ఆ నియమాల్ని క్షుణ్ణంగా తెలుసు కోవలసి ఉంటుందని వివరించారు. యోగా టీచర్ వెంకట సుబ్బమ్మ విద్యార్థులకు యోగా నేర్పిం చారు. చెస్ కోచ్ అరవింద్ జిరాఫీ చెస్, క్యారం బోర్డ్ లూడా ఖోఖో ఆటలపై విద్యార్థు లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కధారచయిత డికె చదువుల బాబు గ్రంథాలయ రికార్డు అస్సెంట్ ఇబ్రాంసాహెబ్ విద్యార్థులు పాల్గొన్నాను.

## పెద్దమండ్యం మండలంలో ఏంజరుగుతుంది...?

పెద్దమండ్యం మే 25 ప్రభాతవార్త

పెద్దమండ్యం మండలంలో ఏంజరుగుతుందో ఏంజరగలేదో తెలియడం లేదని ప్రజల్లో అధికారుల్లోసైతం సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గత ఎస్ఐబదిలీపై వెళ్లినవారంరోజులకు ఎస్ఐగా వినోద్‌కుమార్ బాధ్యతలు చేపట్టి పట్టుమని నెల రోజులు కాకుండానే బదిలీకావడంఏంటి,తాసీల్దార్ బదిలీఅయ్యి 10రోజులు అవుతున్నా రిలీవ్‌కాకుండా ఉండడంఏంటో పెద్దమండ్యం మండల పరిస్తితి ఎవ్వరి అర్థంకాక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సమస్యలతో న్యాయం చేయడానికి ఎస్ఐ అందుబాటులో లేరని,మండల కార్యాలంలో సమస్యలు పరిష్కారంలో జాప్యం పంచాయితీ నిధులురాక వీధిదీపాలులేక అందకారంలో ప్రజలు అల్లాడుతున్నారు. నత్తనడకన హౌసింగ్‌పనులు, దీంతో ప్రభుత్వ పని తీరుపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాఅధికారులు మండల పరిస్థితులపై ఆరా తీసి సమస్యలు పర్కిరించాల్సిన అవసరంవుంది.లేకుంటే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగేఅవకాశం వుంది.

## పర్యాటక ప్రదేశాలకు ఆర్టీసీ బస్సులు నడపాలి

కడప వైద్యవిభాగం, మే 25, ప్రభాతవార్త:



జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి ఆర్టీసీ బస్సులు వేయాలని వేసవి కాలంలో విహార యాత్రలకు కడప ఆర్టీసీ వారు పర్యాటక ప్రదేశా లైన గోవా, హార్సిలీహిల్స్‌లకు బస్సులు వేయడం జరిగింది. అందుకు గాను ఎంతో అభినందనీయమని ఆర్కే రాయల్ కరీం సేవా సమితి యునైటెడ్ ముస్లిం ఫోరం రఫీక్ అన్నారు. కడప జిల్లాలో కూడా ఎన్నో అందమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని వటిని తిలకించడానికి కడప ఆర్టీసీ వారు బస్సులు వేయాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాను వారి కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. దీనిపై రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్‌తో మాట్లాడి జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి బస్సులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

## నేటి వాలంటీర్లే రేపటి పాలకులు : ఎంపీపీ

వీరబల్లి మే 25, ప్రభాతవార్త



నేటి వాలంటీర్లే రేపటి నాయకులు అని వీరబల్లి మండల ఎంపీపీ గాలివీటి. రాజేంద్ర నాథ రెడ్డి తెలిపారు. గురువారం పెద్దివీడు సచివాలయంలో జరిగిన వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీపీ గాలి వీటి రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి వాలంటీర్లే రేపటి పాలకులని ఆయన కొనియాడారు రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ఎంతో నమ్మకంతో పరిపాలన సాగిస్తున్నారు పాలకుల కన్నా వాలంటీర్ల ముఖ్యమంత్రి నమ్మకం. ముఖ్యమంత్రి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ప్రతి వాలంటీర్ నీతి, నిజా యితీగా కష్టపడి ప్రజలకు సేవలు అందించాలన్నారు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హత గల ప్రతి లబ్దిదారునికి అందించే బాధ్యత వాలంటీర్ల పైనే ఉందన్నారు వాలంటీర్ల పనితీరు గుర్తించి వారిని ప్రోత్సహించాలని ఉద్దేశంతో ప్రతి ఏటా ప్రశంసించడమే కాకుండా ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతిని కూడా వారి అకౌంట్లో జమ చేయడం ఆనందదాయకమన్నారు. అనంతరం సేవా రత్న పురస్కారాలతో వాలంటీర్లను గ్రామ పంచాయతీ సర్పంచ్ నాగిరెడ్డి,సంఘం వాండ్లపల్లి సర్పంచ్ స్వామి సొసైటీ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి ఎంపీడీవో మల్లేశ్వరి వాలంటీర్లను సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## పవర్ లిఫ్టింగ్‌లో మాట్లి బాలికకు గోల్డు మెడల్

వీరబల్లి మే 25, ప్రభాతవార్త



ఈ నెల 20వ తెదేన తెనాలిలో జగిగిన 10వ పవర్ లిఫ్టిం గ్ జూనియర్ బాలికల విభాగంలో వీరబల్లి మండలం, మాట్లి తోగట పల్లికు చెం దిన దేవరింటి శివరాం సుగుణల కుమార్తె దేవరింటి. ప్రస న్న గోల్డ్ మెడల్ సాధించడం పట్ల అన్నమయ్య జిల్లా వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మోడెం నాగ భూషణం సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా గురువారం అయన పత్రికా విలేకర్లతో మాట్లాడుతూ తమ స్వంత గ్రామమైన మాట్లి కి చెందిన ప్రసన్న గోల్డ్ మెడల్ సాధించడంతో తమ గ్రామానికే గకుం డా మండలానికి కూడా మంచి పేరు తెచ్చిందన్నారు. ఈ సందర్బంగా ఆమెకు, వారి కుటుంబానికి అభినందనలు తెలిపారు. ప్రసన్న గోల్డ్ మెడల్ సాధిం చడమే కాకా జాతీయ స్థాయికి సెలెక్ట్ అయ్యిందాన్నారు. ఈమె ప్రస్తుతం ఈడూపుల పాయ లో ఐఐటి లో ఈసీ 3వ సంవరం చదువుతుందాన్నారు. ఈమె జీవితం లో మరిన్ని విజయాలు సాధించి మండలానికి మంచి ఘనత తేవాలని ఆకాంక్షిస్తూన్నామన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన

ప్రొద్దుటూరు అర్బన్ మే 25, ప్రభాతవార్త



భగవద్గీత పారా యణం వలన భక్తి శ్రద్దలు పెరుగుతాయని కైవల్య తీర్థ స్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక లైట్ పాలెం సెంటర్ లోని ఎం. వి. ఎస్. ధ్యాన మందిరం నందు మే 1 నుండి 25వ తేదీ వరకు భగవద్గీత 12వ అధ్యాయం, భక్తి యోగం పై శిక్షణ పొందిన 2 నుండి 9వ తరగతి చదివే విద్యార్థులకు శ్లోకాల పఠనం నిర్వహించి కిడ్స్, జూనియర్స్ విభాగంలో తొలి, రెండవ స్థానంలో నిలిచిన వారికి, పాల్గొన్న వారందరికీ కన్సొలేషన్ బహు మతులు అందజేశారు. ఈ సందర్భంగా కైవల్య తీర్థ స్వామి మాట్లా డుతూ తమ సెంటర్ తరపున గత 12 సంవత్సరాల నుండి 2 నుండి 9వ తరగతి చదివే విద్యార్థులకు భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 110 మంది విద్యార్థులు శిక్షణ పొందగా, చివరి రోజు దాదాపు 65 మంది హాజరయ్యారని వివరించారు. కిడ్స్ విభాగంలో అభిరామ్, కృషిత, జూనియర్స్ విభాగంలో హర్షిత, ఉమేష్ చంద్ర ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలవగా వీరికి స్వామివారి శిష్యుడు మాలేపాటి సునీల్ సహకారంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వామివారి శిష్య బృందం, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వీరబల్లి పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్

వీరబల్లి మే 25, ప్రభాతవార్త



వీరబల్లి మండల పరిసరా లలో కన్నీటి సాక్షిగా (ఇది కథ కాదు నిజం) అనే సినిమా షూటింగ్ గురువారం గరిగింది. కొన్ని సన్నివేశాలను హరి హరాదుల దేవాలయం సాయి బాబా దేవాలయం నందు చిత్రీకరించారు. ఈ సినిమాలో పలు దృశ్యాలను కథా నాయకుడు, నాయికలపై షూట్ చేశారు. ఇంకా కొన్ని సన్నివేశాలను పరిసర ప్రాంతాలలో చేస్తున్నట్లు డైరెక్టర్ అనిల్ చెన్నారు, తెలిపారు. ఈ సినిమాకు నిర్మాత పగడాపూల మల్లికార్జున, హీరో ముజాబు, హీరోయిన్ మేఘన నటిస్తున్నారన్నారు. ప్రజలు ఇలాంటి సినిమాలను ఖచ్చితంగా అందరిస్తారని తెలిపరు.

## లోకేష్ పాదయాత్రకు ప్రవీణ్‌రెడ్డి సంఘీభావం

ప్రొద్దుటూరు మే 25, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వ అరాచక పాలనను ఎండ కొడుతూ ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగలం పాద యాత్రకు సంఘీభావంగా టిడిపి ఇన్చార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి పాద యాత్రలో పాల్గొన్నారు. గురువారం జమ్మలమడుగు నియోజకవర్గంలో కొన సాగుతున్న యువగళం పాదయాత్రలో నారా లోకేష్ అడుగులో అడుగు వేస్తూ ఆయన పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందా లంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు సరైన నాయకుడని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. అన్నారు వచ్చే సార్వత్రిక ఎన్నికలలో టిడిపి అఖండ మెజారిటీతో అధికా రం చేపడుతుందని ఆయన జోస్యం చెప్పారు.

## యువగళం పాదయాత్రలో నల్లబోతుల నాగరాజు

ప్రొద్దుటూరు మే 25, ప్రభాతవార్త



జమ్మలమడుగు నియోజక వర్గంలో టిడిపి జాతీ య కార్యదర్శి నారా లోకేష్ చేపట్టి మూడవ రోజు కొనసాగుతున్న యువ గళం పాదయాత్రకు సంఘీ భావంగా ప్రొద్దుటూరు టిడిపి ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యం లో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ యువగలం పాదయాత్రలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వైసీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగెత్తి పోయారని పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకునేం దుకు ప్రజలు ఎదురుచూస్తున్నా రని చెప్పారు ఈ పాదయాత్రలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమర్నాథరెడ్డి, కేకే చౌదరి, జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి, విశ్వనాథ్ యాదవ్ కలిసి నారా లోకేష్ అడుగులో అడుగు వేస్తూ సంఘీభావం తెలిపారు.

**పాసుపోర్టు పోయినది**

చాంద వెంకటసుబ్బారెడ్డి S/o చాంద సంది రెడ్డి, డోర్.నెం. 4/136. యం. చౌటపల్లి, పెండ్లిమర్రి మం॥ వై.యస్.ఆర్ కడపజిల్లా, ఆం.ప్ర. మా ఇంటి నుండి వేరే ఇంటికి ఇంటి సామాన్లు మార్పు చేస్తుండగా నా పాస్‌పోర్టు నెం.F8865507 పోయినది. దొరికినవారు పై అడ్రస్‌కు తెలుపగలరు.

**పాసుపోర్టు పోయినది**

నా పేరు కొప్పూరి హరిబాబు. మాది రాజంపేట మం॥ మిట్టమీదపల్లె గ్రా॥పోస్టు, డోర్.నెం. 1/199. నేను రాజంపేట టౌన్ పాతబస్టాండు నుండి మా వూరికి ఆటోలో వెళ్తుండగా నా పాస్ పోర్టు నెం.T2413503 పోయినది. ఎవరికైనా దొరికినచో పై అడ్రస్‌కు ఈ క్రింది నెంబర్ కు తెలుపగలరు. 9347935938.

# ఆ మంచినీరు తాగితే అంతే..

-గుంటివీరన్నపల్లిలో పారిశుద్ధ్యం అధ్వానం

కలికిరి, మే 25, ప్రభాతవార్త:



మండలంలోని అద్దెవారిపల్లె పంచాయతీ గుంటివీరన్నపల్లిలో గత మూడు నెలలుగా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని చేతి బోరులో మంచి నీరు పుష్కలంగా ఉన్నాయి. గ్రామస్థులు ఆ చేతిబోరు మంచినీటితో దాహం తీర్చుకుంటున్నారు. చేతిబోరు వద్ద మురికినీరు, చెత్త చేరడంతో మురికినీరు మంచినీటిలో చేరి కలుషితం జరిగి ఆ ననీరు తాగడం వల్ల గ్రామస్థులు అనారోగ్యంపాలవుతున్నారు. చేతిబోరు వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానిక పంచాయతీ ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి ప్రజలు తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభాతవార్త పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్‌ను వివరణ కోరగా అద్దెవారిపల్లె పంచాయతీలోని అంబాసిడర్లు విధులకు హాజరుకావడం లేదని శుక్రవారం చేతిబోరు వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు.

## 29వ తేదీన శ్రీహరికోటకు ప్రత్యేక బస్సు

పీలేరు, మే 25 ప్రభాతవార్తః

శ్రీహరికోటలో జీఎస్ఎల్వి- ఎఫ్ 12 ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన రాకెట్ ప్రయోగించి ఎన్‌వీఎస్ 01 ఉపగ్రహాన్ని కక్షలో ప్రవేశపెట్టబడును, ఈసందర్భంగా పీలేరు డిపో నుంచి శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయనున్నట్లు డీపో మేనేజరు బండ్లకుమార్ తెలిపారు. రాకెట్ లాంచింగ్ వీక్షించుటకు శ్రీహరికోటలో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటుచేయడమైనది. ప్రత్యేక గ్యాలరీలో మన బస్సులో సీట్లు బుక్ చేసుకున్నవారికి రాకెట్ లాంచింగ్ వీక్షించుటకు గాను తగిన సీట్లు ముందస్తుగా రిజర్వుచేయబడును. అలాగే రిటన్‌లో శ్రీచెంగాలమ్మ అమ్మవారి ఆలయ దర్శనం కూడా ఏర్పాటుచేయడమైనది కావున ప్రజలు ఆసక్తి ఉన్నవారు లాంచింగ్ వీక్షించుటకు పీలేరు నుంచి శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు 29 ఉదయం 4గంటలకు బయలుదేరును కావున పట్టణ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

## పంపిణీకి సిద్ధంగా వేరుశనగ విత్తనాలు

మదనపల్లె, మే 25 ప్రభాతవార్త:

2023ఖరీఫ్ పంట కాలానికి సబంధించి 18 ఆర్బీకే కేంద్రాల్లో వేరుశెనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ నాగప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. రూరల్ మండల పరిధిలో 1668క్వింటాళ్ళ వేరుశెనగ విత్తనం మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 1300క్వింటాళ్ళు వేరుశెనగ విత్తనం ఆర్బీకే కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు ఆర్‌బికేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలిపారు. 30కిలోల వేరుశెనగ బస్తా రూ.1674లతో రాయితీధరలతో విక్రయించడం జరుగుతుందన్నారు.

## రోగులకు పండ్లు,పాలు పంపిణి



మదనపల్లెక్రైం, మే 25 ప్రభాతవార్త :

టెలికాం అడ్వజర్ కమిటీ మెంబర్ హర్షవర్ధన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా వైసిపి నాయకులు నర్రిబాబాయి. సాయిశేఖర్‌రెడ్డిల అధ్వర్యంలో గురువారం రోగులకు పండ్లు, పాలు పంపిణి చేశారు. ఈ సందర్బంగా నర్రిబాబాయి, సాయిశేఖర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబులు మాట్లాడుతూ హర్ష జన్మదినం పురష్కరించుకుని ప్రతి ఏడాది పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రోగులకు పండ్లు, పాలు పంపిణితో పాటు, అన్నదానం చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో పూర్ణ, అశోక్, నారాయణ, జాకీర్, క్రిష్ణమూర్తి, హర్ష యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీవాలీశ్వరస్వామి రాజగోపరం వార్షికోత్సవం

రామసముద్రం, మే 25 ప్రభాతవార్త :



మండల కేంద్రంలో వెలసియున్న శ్రీ వాలీశ్వరస్వామి రాజగోపురం మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధరకర్త లక్ష్మీపతి తెలిపారు. ఉదయం 7గంటలకు కలశస్థాపన, మూర్తిహోమం, రుద్రాభిషక్రం, మంగళహారతి తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్లు, ఆలయ ప్రధాన అర్చకులు అనీల్‌కుమార్ స్వామి తెలిపారు.

## వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ముగింపు

రామసముద్రం, మే 25 ప్రభాతవార్త :

రామసముద్రం మండలంలోని మినికి గ్రామంలో అత్యంత వైభవంగా శ్రీదేవి భూదేవి సమేతంగా గ్రామ పురవీదుల్లో వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రమాదసేవ, కలిశారాదన, హోమం, ప్రసాద వినియోగం అనంతరం తోమాల సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. మినికి గ్రామ పెద్దలు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బటర్, ఆగమికులు త్రివిక్రమ, సురేష్‌బట్టర్ పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన మారెమ్మ తల్లి జాతర

రామసముద్రం, మే 25 ప్రభాతవార్త :



మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయితీ తిరుమలరెడ్డి పల్లెలో వెలిసిన గ్రామ దేవత మారెమ్మ జాతర ముగింపు సందర్భంగా మారెమ్మ తల్లికి సెలవంటూ వందనాలు చేసి మొక్కలు తీర్చుకొన్నారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి జంతుబలి చేశారు. అమ్మవారి శిరస్సును గ్రామ పురవీధుల్లో ప్రత్యేకంగా ఊరేగించారు. ఇంటింటా మహిళలు మంగళ హారతులు, కర్పూర హారతులు పట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారు. అమ్మవారి దర్శనం కోసం బెంగుళూరు, తమిళ నాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలిరావడంతో ముగింపు కార్య క్రమం ఘనంగా కొనసాగింది. దీంతో పలువురు భక్తాదులు, ప్రజలు తీర్థప్రసా దలుస్వీకరించి సెలవమ్మా అంటూ మొక్కుకొన్నారు.

# కోర్టుకెళ్ళారన్ననెపంతో వ్యక్తిపై దాడి

రామసముద్రం, మే 25 ప్రభాతవార్త :

రామసముద్రం మండలం అరికెల పంచాయితీ గోసువారిపల్లెలో కాపురం ఉండే యర్రంరెడ్డి కుమారుడు శివారెడ్డి(43) గురువారం దాడిచేసి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ విచారించారు. అదే గ్రామానికి చెందిన సురేష్,అశోక్, రామచంద్రప్ప, శివారెడ్డిల మధ్య గతంలో భూ సమస్యలు ఉండడంతో శివారెడ్డి కోర్టుకెళ్ళాడు. దీనిని సహించలేని సురేష్, అశోక్, రామచంద్రప్పలు ఒక్కసారిగా శివారెడ్డిపై దాడి చేసి గాయపరిచినట్లు విచారణలో తేలింది. దీనిపై కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

## ప్రభుత్వ భూముల జోలికి వస్తే చట్టపరంగా చర్యలు

తహశీల్దారు ధనుంజయ

పీలేరు, మే 25 ప్రభాతవార్తః



దినదినానికి అభివద్ధి చెందుతున్న పీలేరు మండలం పీలేరు పట్టణంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నట్లు కొంత మంది ఫిర్యాదులు చేశారని అలా అన్యాక్రాంతం అవుతున్న భూములను గుర్తించి ఆక్రమించుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దారు తెలిపారు. గురువారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ పీలేరు పట్టణంలో అత్యధిక సంఖ్యలో ఉదో  యగస్తులు, విద్యార్థులు వ్యాపారస్తులు జీవనం సాగిస్తుండటంతో భూములు రేట్లు విలువ పెరుగుతుండటం గమనించిన కొంతమంది ప్రభుత్వ భూములలో పాగా వేస్తున్నట్లు తెలుస్తున్నదని అటువంటి వారిపై నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు నివేదించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని తహశీల్దారు అన్నారు.

### ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తాం

జిల్లా రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటిస్తామని తహశీల్దారు అన్నారు. గత రెండు రోజులు క్రితం బోడుమల్లువారిపల్లె పంచాయతీలో ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రభుత్వ భూములలో పేలుడు పదార్థాలతో బండలను పేల్చినట్లు సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించి పేలుళ్లు నిలుపుదల చేశామని మండల పరిధిలో పేలుళ్ల కాంర్యక్రమాలు జరిగితే తమకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు. రాష్ట్రంలోనే మేజరు పంచాయతీ పీలేరు పట్టణంలో రెవెన్యూ పరంగా సమస్యలు పరిష్కరించడానికి తమ సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు అన్నారు.

## సకాలంలో బ్యాంకు నందు నగదు జమచేయాలి

పీలేరు, మే 25 ప్రభాతవార్తః



ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు మద్యం అమ్మగా వచ్చిన నగదును సకాలంలో బ్యాంకు నందు జమచేయాలని చిత్తూరు మద్యం డిపో ఇన్స్‌పెక్టర్ రామకష్ణశాస్త్రి సూపర్‌వైజర్లను హెచ్చరించారు. చిత్తూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్, డిపో ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు గురువారం పీలేరు పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈసందర్బంగా విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది సూపర్‌వైజర్లు నగదును ప్రయివేటు వ్యక్తుల ద్వారా సేల్స్‌మెన్లు ద్వారా బ్యాంకుల నందు జమచేయిస్తున్నారని అలా జరిగితే సూపర్‌వైజర్‌దే బాధ్యత వహిస్తారని ఆయన అన్నారు. ఆన్‌లైన్ ద్వారా నిల్వలను నిశితంగా పరిశీలించారు. ఈతనిఖీలలో వెరిఫికేషన్ ఆఫీసర్ నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 5లీటర్ల సారా స్వాధీనం- వ్యక్తి అరెస్టు

కేవి.పల్లె, మే 25 ప్రభాతవార్తః



మండలంలోని జిల్లేళ్లమంద కొత్త బిడికి గ్రామం వద్ద దాడులు నిర్వహించగా లక్ష్మీనాయక్ వద్ద 5 లీటర్ల నాటుసారా కలిగి ఉండగా అరెస్టుచేసి స్వాధీనం చేసుకుని అరెస్టుచేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఈబీ సీఐ గురుప్రసాద్ తెలిపారు. ఈదాడిలో ఎస్సై లక్ష్మీనరసయ్య సిబ్బంది యోగానంద, సురేష్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ పంటల సాగు రైతులకు ఎంతోమేలు

వాల్మీకిపురం, మే 25 ప్రభాతవార్తః



ప్రధాన పంటల సాగుతో పాటు రైతులకు ఎంతో మేలు అని తద్వారా రైతులకు అధిక ఆదాయం సాధ్యమవుతుందని రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రాజెక్టు ఎగ్జిగూటివ్ రాజేష్ న్నారు. మండలంలోని చింతపర్తిలో రైతులు సాగుచేస్తున్న ప్రకతి వ్యవసాయ సాగును గురువారం 10మంది రాజస్థాన్ రాష్ట్రంకు చెందిన మహిళలు వచ్చి పరిశీలించారు. ఈసందర్బంగా స్థానికంగా ప్రకతి సాగును చేపట్టిన రైతులు మాట్లాడుతూ 360 రోజులు పాటు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు సాగు చేయడంతో పాటు నిత్యం వచ్చిన దిగుబడులను మార్కెట్‌కు తరలించి మంచిగా ఆదాయం పొందు తున్నాయని రాజస్థాన్ మహిళలకు వివరించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయంలో వచ్చే దిగుబడులకు మార్కెట్‌లో మంచి డిమాండు ఉండడంతో పాటు, అతర్ పంటల సాగువలన నిరంతరం ఆదాయం సాధ్యమవుతుందన్నారు. భూమిపైన జీవ వైవిద్యం, భూమిలోపల రకరకాల వేరు వ్యవస్థ ద్వారా అనేక రకాల సూక్ష్మజీవులు ఉత్పన్నమవుతాయని తద్వారా మొక్కకు కావలసిన పోషకాలు సమద్ధిగా అందుతాయని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది రెడ్డిబాషా, పెద్దరెడ్డెయ్య, శ్రీనాథరెడ్డి, హరినాథ్, హేమలత, స్థానికులు మహిళలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

వాల్మీకిపురం,మే 25 ప్రభాతవార్తః




పూర్వపు నియోజకవర్గ కేంద్రం, ప్రస్తుత మండల కేంద్రమైన వాల్మీకీపురం పట్టణంలో మాసం రోజుల నుంచి ఆధార్ సేవలు నిలిచిపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ప్రజలు వాపో తున్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలోని ఆధార్ సెంటర్‌ను గత కొంత కాలంగా పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని టెలికాం కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అయితే ఈఆధార్ సెంటర్‌ను నడిపే నిర్వాహకులు ఆధార్ సేవలు కోసం వచ్చే ప్రజల నుంచి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు సైతం ఎదుర్కొంటున్నారు. ఈ ఆధార్ సెంటర్‌లో ఎక్కువ డబ్బులు ఇచ్చుకోలక వాల్మీకిపురం పొరుగున ఉన్న నిమ్మనపల్లె , సీటీఎం ఆధార్ కేంద్రాలకు వెళ్లి ప్రజలు సేవలు పొందేవాళ్లు వాల్మీకిపురం లో ఆధార్ సెంటర్ లేకపోవడంతో మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం, ఇప్పటికైనా సంబంధిత ఆధార్ నిర్వాహకులపై చర్యలు తీసుకుని ప్రజలకు ఆధార్ సేవలు అందుబా టులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## విత్తనాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

రామసముద్రం, మే 25 ప్రభాతవార్త :

మండలంలో నేటినుంచి వేరుశెనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ రైతులు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి మోహన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలానికి విత్తనకాయలు 1958క్వింటాళ్ళును కేటాయించారని వీటి పంపిణీ కోసం నేటి నుంచి తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్ల రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. దీనికి రైతులు పాసుబుక్ జిరాక్స్, మొబైల్‌ఫోన్ నెంబర్ ఆధార్‌కార్డు జిరాక్స్ తమ వెంట తీసుకురావాలని తెలిపారు. 30కిలోల బస్తా పూర్తి ధర రూ.2790లు రాయితీ రూ.1116లు పోనూ రైతు 1674లు చెల్లించాలని తెలిపారు.

## నేడు కేవి.పల్లెలో మండల సమావేశం

కేవి.పల్లె, మే 25 ప్రభాతవార్తః

శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించబడునని ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచిలు, మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలపై చర్యలు తీసుకోండి

అడ్వయిజర్ కమిటీ సమావేశంలో ఆర్డీఓ




మదనపల్లె, మే 25 ప్రభాతవార్త:

పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. గురువారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో పట్టణ ట్రాఫిక్ సమస్యపై అడ్వయిజర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య అధికం అవుతోందని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో సూచించిన ప్రాంతాల్లోనే వాహనాలు నిలిపేలా, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు, వాహన డ్రైవర్లు నిబంధనలు పాటించేలా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా బెంగుళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు, పటేల్‌రోడ్డు, అవెన్యూరోడ్డు, సిటిఎం రోడ్డు, గాంధీరోడ్డు మార్గాల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. ప్రతిశాఖ అధికారి ట్రాఫిక్‌పై వారికి కేటాయించిన విధులను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ట్రాఫిక్ సమస్య నియంత్రించినపుడే ప్రమాదాలను కూడా అరికట్టవచ్చునన్నారు. ఆటోల ఆగడాలను కూడా నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి కేశప్ప, సిఐలు మురళీక్రిష్ణ, మహమ్మద్, మున్సిపల్ కమీషనర్ ప్రమీల, ఆర్టీఓ, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, ఫారెస్టు, ఆర్టీసి వివిధశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ చలపతి

మదనపల్లె, మే 25 ప్రభాతవార్త:



క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి తెలిపారు. గురువారం మిషన్‌కాంపౌండ్‌లో పుట్‌బాల్ టోర్నమెంటును ప్రారంభించారు. మూడు రోజులు పాటు జరిగే ఈ టోర్కమెంటు ప్రారంభోత్సవానికి వైస్ ఛైర్మెన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుట్‌బాల్ క్రీడకు మదనపల్లె పేరు పొందిందన్నారు. క్రీడల పట్ల క్రీడాకారులకు స్నేహబావం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకొని గెలుపొందేందుకు యత్నించాలన్నారు. ఓటమి కూడా మరో గెలుపుకు సోపానం అన్నారు. అనంతరం చర్చిఫాదర్ భక్తవత్సలం, వరప్రసాద్, కౌన్సిలర్ పర్జానాఠఫి మాట్లాడుతూ శానిటోరియం పుట్‌బాల్ క్రీడకు పేరుపొందిందన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపుకు కృషి చేయాలన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన నాయకులు

మదనపల్లె, మే 25 ప్రభాతవార్త:



బెంగుళూరు రోడ్డులో గురువారం జరిగిన బస్సు ప్రమాదంలో గాయాలకు గురై జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు పొందుతున్న క్షతగాత్రులను పలువురు నేతలు పరామర్శించారు. రాజంపేట ఎంపి, లోకసభ పక్షనేత మిథున్‌రెడ్డి ఫోన్‌లో క్షతగాత్రుల పరిస్థితిని అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్సలను అందించాల్సిందిగా ఆర్ఎంఓను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమేష్, షాజహాన్‌బాషా, జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి, వైస్‌ఛైర్మెన్ జింకా వెంకటాచలపతిలతో పాటు పలువురు నాయకులు, కార్పోరేషన్ డైరెక్టర్లు క్షతగాత్రులను పరామర్శించారు.

## జపాన్ యూనివర్శిటిలో మిట్స్‌యూనివర్శిటి ఎంఓయు

కురబలకోట, మే 25 ప్రభాతవార్త :



జపాన్ యూనివర్శిటితో మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వర్చువల్ కార్యక్రమంలో ఎంఒయు చేసుకొన్నాయని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. జపాన్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టూట్‌ఆఫ్ టెక్నాలజీ ఇచినోసెకి కాలేజితో ఏపిలోనే మిట్స్ కళాశాల ఐదేళ్ళ పాటు ఎంఒయును చేసుకొన్నాయని ఆయన తెలిపారు. ఎంఒయులో భాగంగా మిట్స్ విద్యార్థులు జపాన్‌లోని కళాశాలలో ఇంటర్నషిప్ ఎంహెచ్ ప్రోగ్రామ్‌లు చేయడానికి అవకాశం కలిగిందని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఇందులో భాగంగా ప్యాకల్టి మార్పిడి, ఉమ్మడి పరిశోదనా కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. వర్చువల్‌లో ఆ కళాశాలకు చెందిన ప్రెసిడెంట్ నోబూఓఅరాకి, మిట్స్ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్‌లు వర్చువల్‌లో ఎంఒయు సంతకాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ ప్రొపెసర్ గౌతం చక్రవర్తి, డీన్ అడ్మినిస్టేటీవ్ డాక్టర్ శ్రీమంతుబసు, ఇంటర్‌నేషనల్ రిలేషన్స్ సీనియర్ మేనేజర్ జి.లక్ష్మి, డీన్ ప్రొపెసర్ బసాబి చక్రవర్తి, సుస్మితాలు పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పీలేరు, మే 25 ప్రభాతవార్తః

మండలంలోని జాండ్ల గ్రామ పంచాయతీ పెద్ద హరిజనవాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు, గ్రామవలంటీర్లు , అధికారులతో కలిసి గడప గడపకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన గడప గడపకు కార్యక్రమానికి ప్రభుత్వం నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు డప్పు వాయిద్యాతో హారతులతో ప్రజలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు చేరుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని పేదలు ఆర్థికంగా అభివద్ధి చెందాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచి హబీబ్‌బాషా జడ్పీటీసీ ఏటి .రత్నశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది మరియు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## నేడే మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కలికిరి, మే 25, ప్రభాతవార్త:

కలికిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26 శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో గంగయ్య యాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.

## ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

బద్వేలు, మే 25 ప్రభాతవార్త :



బి.మఠం మండలం కమ్మవారిపల్లె గ్రామంలో ఉద్యాన పంటలపై బద్వేలు కోరమాండల్ గ్రోమోర్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోరమాండల్ గ్రోమోర్ సీనియర్ శాస్త్రవేత్త డా॥ చక్రదర్ పాల్గొని మాట్లాడుతూ దానిమ్మ పంటలు వేస్తే దిగుబడి ఎలా వస్తుంది, ఏ స్థాయిలో పంటలను సంరక్షించుకోవాలనే అంశాలపై వివరించారు. ఉద్యాన పంటలలో సేంద్రీయ ఎరువుల ప్రాధాన్యత గురించి తెలియజేశారు. సేంద్రీయ పరీక్షలు, పంటల యాజమాన్యం గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొని రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు పంటల దిగుబడి గురించి రైతులకు మెళకువల గురించి వివరించారు. చీని తోటలను, దానిమ్మ తోటలను శాస్త్రవేత్తలు సందర్శించి రైతులకు పలు రకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప ఏరియా మార్కెటింగ్ మేనేజర్ రాజశేఖర్, బద్వేలు గ్రోమోర్ మేనేజర్ మల్లిఖార్జున రెడ్డి, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## జెడ్‌హెచ్‌డీసీ భూములలో ఆక్రమణలు గుర్తించి అర్హులకు అందించాలి

-బీకేఎంయూ నాయకుల డిమాండ్

ఓబులవారిపల్లె, మే 25, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం జెడ్‌హెచ్‌డీసీ భూముల్లో కొందరు అర్హులైన లబ్ధిదారులకు సంబంధించిన భూ రికార్డులు తారుమారు చేసి భూములను ఆక్రమించి ఎవరి భూమి ఎక్కడుందో తెలియకుండా చేశారని అర్హులైన లబ్ధిదారులు రికార్డుల ప్రకారం భూములను తిరిగి పంపిణీ చేయాలని అన్నమయ్య జిల్లా బీఎంకేయూ ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప డిమాండ్ చేశారు. గురువారం ఓబులవారిపల్లె తహసీల్దార్ పీర్‌మున్నీకి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీఎంకేయూ) ఆధ్వర్యంలో పందుగోళ్ల మణి తదితరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1972లో కలెక్టర్ పేరుపై ప్రభుత్వ బంజరు భూములు చదును చేసి బోర్లు వేసి ఒక్కో దళిత రైతులకు 3 నుంచి 4 ఎకరాల చొప్పున భూమి పంచారని ఆ భూములు అనివార్య కారణాల వల్ల కొందరు సర్వే చేసేటప్పుడు ఉండి ఆ తరువాత కొంత మంది కుటుంబ యజమానులు మరణించినప్పుడు ఎటువంటి వసతి లేని వారు ఆ భూములు ఎక్కడున్నాయో తెలియక భూములు సాగు చేసుకోలేకపోయారన్నారు. దాదాపు 876 ఎకరాలు ప్రభుత్వ బంజరు భూమి నేరుగా కలెక్టర్ వ్యవసాయానికి అనుగుణంగా ఏర్పాటు చేశారన్నారు. అయితే కొందరు రెవెన్యూ అధికారులు లాలూచీ పడి కొంత మంది దళిత నాయకులకు పట్టాల రూపంలో అడంగళ్ కహానీలు మార్చి పట్టాలిచ్చారని అర్హులను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికి తిరిగి వారి భూమి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసఉకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్, అశోక్, నరసింహులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## గురివిరెడ్డి కాలనీగా నామకరణం

బ్రహ్మంగారి మఠం, మే 25 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన బ్రహ్మంగారి మఠంలోని వికలాంగుల కాలనీకి కామ్రేడ్ ఎత్తపు గురివిరెడ్డి కాలనీగా నామకరణం చేసిన సందర్భంగా ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి గోవిందు అధ్యక్షతన కడప సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివ కుమార్, జిల్లా మండల కమిటీ సభ్యులు అన్వేష్ హాజరై సంస్మరణ సభను ఉద్దేశించి వారు ప్రసంగించారు. కామ్రేడ్ ఎత్తపు గురివిరెడ్డి గత 20 ఏళ్లకు పైగా సీపీఎం పార్టీలో సభ్యులుగా, కార్యదర్శిగా, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మరియు రైతు సంఘాలతో జరిగిన ప్రజా పోరాటాలలో కీలక పాత్ర వహించారని కామ్రేడ్ గురివిరెడ్డి సేవలను కొనియాడారు. శివ కుమార్ మాట్లాడుతూ తనతో కలిసి పనిచేసిన సహచరుడైన గురివి రెడ్డిని కోల్పోయి నేటికి ఏడాది కావస్తుందని, ఆయన లేని లోటు సీపీఎం మండల కమిటీకి పూడ్చలేనిదన్నారు. అన్వేష్ మాట్లాడుతూ గురివిరెడ్డి పేద ప్రజలను ఐక్యం చేసి వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వాలకు రాజీలేని పోరాటాలు నిర్వహించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గండి గురయ్య, గండి సునీల్, హరి, సుబ్బమ్మ, మేరి, అజయ్, భాస్కర్, నాయుడు, రమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలం విషయంపై ఇరువురు ఘర్షణ

– మహిళలకు తీవ్ర గాయాలు

రామాపురం, మే 25 ప్రభాతవార్త:



మండలంలోని సరస్వతిపల్లి పంచాయతీ ఉడుమువారిపల్లికి చెందిన షేక్ షకీల్‌బేగంపై అదే గ్రామానికి చెందిన షేక్ సలాం, సుభాహాన్, మహమ్మద్ గౌస్‌లు బుధవారం రాత్రి ఇంటి స్థలం విషయం ఘర్షణపడ్డారు. ఈ ఘర్షణలో షకీలా బేగంకు చెయ్యి విరిగి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించాయి. ఈ మేరకు బాధితురాలు కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఔట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు తెలిపారు.

## గ్రంథాలయంలో ఆటలు డ్రాయింగ్ పోటీలు

చిన్నమండెం, మే 25ప్రభాతవార్త:




మండల కేంద్రమైన చిన్నమండెం గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఆటలు డ్రాయింగ్ పోటీలను నిర్వహించామని గ్రంథాలయ నిర్వాహకుడు ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు కథలు చదవడం,యోగా, ఆటలు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**సప్తగిరి గ్రామీణ బ్యాంక్**
(ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ బ్యాంక్ చే ప్రాయోజితం)
వాల్మీకిపురం శాఖ, వాల్మీకిపురం (మం), అన్నమయ్య జిల్లా, సెల్:8886644093

**బంగారు నగలు వేలం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా ఈ క్రింది కనబరచిన వ్యక్తులు మా శాఖ నందు బంగారు నగలు హామీపై ఋణము పొందియున్నారు. గడువు మీరిననూ ఋణము చెల్లించి నగలు విడిపించుకోవలసినదిగా నోటీసులు పంపినప్పటికీ స్పందించని అప్పుదారుల నగలను 20.06.2023 మంగళవారం మధ్యాహ్నం 3.00 గం॥లకు బ్యాంకు ఆవరణలో వేలము వేయబడును. మిగత వివరములకు బ్యాంకు పనివేళల యందు మేనేజరును సంప్రదించి తెలుసుకోవచ్చును.

| వ.నెం. | అప్పుఖాతానెం | అప్పుదారుని పేరు మరియు చిరునామా | నగలు బరువు గ్రా॥లలో | తీసుకున్న లోను రూ॥లలో |
|---|---|---|---|---|
| 1 | 50043679590 | యస్.మహేశ్వరి, D/o మానిక్యం ఆచారి, మదనపల్లి రోడ్డు, చింతపర్తి(గ్రా), వాల్మీకిపురం మం,అన్నమయ్య జిల్లా | 51.00 | 1,50,000/- |

సం/- బ్రాంచి మేనేజరు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, వాల్మీకిపురం శాఖ.

# వైభవంగా పెద్దమ్మ జాతర



**దువ్వూరు, మే 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఎదమడక గ్రామంలో మూడు రోజుల పాటు పెద్దమ్మ గంగ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. మంగళవారం నూతనంగా ఏర్పాటుఉ చేసిన ఆలయంలో పెద్దమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బుధవారం బోనాలు, దున్నపోతు ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు చేశారు. గురువారం జాతర సందర్భంగా ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలలో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానాన్ని నలాగాయి. అలాగే కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన ఖాజా హుసేన్ ఎద్దులు 2వ స్థానాన్ని, మైదుకూరుకు చెందిన వెంకటేష్ యాదవ్ ఎద్దులు 3వ స్థానం, నంద్యాల జిల్లా చిన్న కానాలకు చెందిన చెన్నారెడ్డి ఎద్దులు 4వ స్థానం, బాపట్ల జిల్లా వేటపాలెం చెందిన శివకృష్ణ చౌదరి ఎద్దులు 5వ స్థానం లాగగా వీరికి వరుసగా రూ.75వేలు, రూ.50 వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు బహుమతి అందజేశారు. పెద్దమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించగా చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# స్పందన కార్యక్రమం పటిష్ఠంగా అమలు

**– ఎంపీడీవో రామకృష్ణయ్య**

**బద్వేలు రూరల్, మే 25 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని తిరువెంగళాపురం రైతు భరోసా కేంద్రం నందు గురువారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోడపాడు రామసుబ్బారెడ్డి, సర్పంచ్ నరసింహ, ఎంపీడీవో రామకృష్ణయ్యతో పాటు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ స్పందన కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారానికి దరఖాస్తు రూపంలో స్వీకరించి ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమం ప్రజలకు మేలు జరిగే విధంగా కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత శాఖల అధికారులను పిలిపించి దరఖాస్తుదారులు సంతృప్తి చెందేలా అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు స్పందన పర్యవేక్షణ బృంధం కృషి చేసి ప్రజలకు ఇక్కట్లు లేకుండా చూద్దామన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతి వారి సహకారంతో మజ్జిగ వితరణ అభినందనీయం

**– ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు**

**బద్వేలు అర్బన్, మే 25 ప్రభాతవార్త :**



వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తిరుపతి నగరానికి చెందిన యచ్చ శ్రీనివాసులు, సతీమణి లక్ష్మీప్రియ కుటుంబ సభ్యులు బద్వేలు పట్టణంలోని మైదుకూరు రోడ్ చలివేంద్రం వద్ద రెండు దఫాలుగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, వాసవీ క్లబ్ ట్రెజరర్ పెసల సుధాకర్, ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ మెంబర్ జొన్నలగడ్డ సుధాకర్ అన్నారు. వాసవీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ అనుమలశెట్టి సిద్దయ్య మేనల్లుడు యచ్చ సాయి సాత్విక్ జన్మ దిన సందర్భంగా సుమారు 500 మందికి పైగా మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా బద్వేలు పట్టణంలో దాతల సహకారంతో వేసవి కాలం ప్రారంభం నుండి ప్రతి రోజూ మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో అభినందించదగ్గ విషయం అన్నారు. తిరుపతికి చెందిన యచ్చ శ్రీనివాసులు ఇప్పటికి రెండు దఫాలుగా వారి కుమారుని పుట్టిన రోజును పురస్కరించుకొని మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉరిమి నాగేంద్ర, కె.నాగేంద్ర, మున్సిపల్ సిబ్బంది సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# రీ సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టండి

**– సర్వేయర్లకు మెడికల్, స్టేషనరీ కిట్లను అందజేసిన కలెక్టర్**



**రాయచోటి, మే 25ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్ర తిష్ఠాత్మకంగా తీసుకున్న రీసర్వే ను పకడ్డందీగా చేపట్టాలని గ్రా మ, మండల సర్వేయర్లకు జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. గురువారం అన్నమయ్య జి ల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ లో జిల్లాలోని 450 మంది గ్రామ, మండల్ సర్వేయర్లకు జిల్లా కలెక్టర్ గిరీషీ పిఎస్ మెడికల్, స్టేషనరీ కిట్లను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రీసర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వేకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచిం చారు. రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని గ్రామ సర్వేయర్లు, సర్వే శాఖలోని అన్ని స్థాయిల సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో పూర్తి అయిన గ్రామాలకు సర్వే రాళ్లను యుద్ద ప్రాతిపదికన పాతాలన్నారు. కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్, డిప్యూటి సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్లు, గ్రామ, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# మండలానికి 769 క్వింటాలు వేరుశనగ విత్తన కాయలు మంజూరు

**రామాపురం, మే 25ప్రభాతవార్త:**



మండలంలోని ఖరీఫ్ సీజన్ సంబంధించి 13 గ్రామ పంచాయతీల క్వింటాలు మంజూరైనట్లు ఏవో నాగమణి తెలిపారు. స్థానిక ఏవో కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 769 క్వింటాలు మంజూరు కాగా ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతోరైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కె6 రకం 424 క్వింటాలు, నారాయణీ రకం 345 మంజూరన్నారు. 40 శాతం సబ్సిడీ పోను రైతుకు కట్టవలసిన ధకే 6 రకంకు 30 కేజీల బస్తా ధర రూ.1670 రూపాయలు. అలాగే నారాయణ రకం 40 శాతం సబ్సిడీ పోను 30 కేజీల బస్తా ధర రూ.1773 రూపాయలతో రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పాస్‌బుక్‌కు 3 బస్తాలు చొప్పున రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# శ్రీవారికి వైభవంగా ఎదుర్కోలు

**బ్రహ్మోత్సవాలలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు**



**బద్వేలు అర్బన్, మే 25 ప్రభాతవార్త :**

పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి నవమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం వేద పండితులు రమేష్ శర్మ మంత్రోచ్చరణల మధ్య ఉదయం చతుర్థానార్చన, మూలమూర్తి హోమం, ఉత్సవ బలి కార్యక్రమాలతో పాటు పలు రకాల విశేష పూజలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుండి స్వామివారికి ఎదుర్కోలు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించడం జరిగింది. బ్రహ్మోత్సవాలలో స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులకు ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మెన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఈవో శివయ్యతో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్టణ, పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకొని కాయా కర్పూరం సమరి ్పంచుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆలయ ప్రధాన అర్చకు లు యం.రమేష్ శర్మ, పరిచాలకులు సాయి చైతన్య ఆధ్వర్యంలో లోకేష్ శర్మ, రమణదీక్షితులు, శ్రావణ్ కుమార్, జయరామ దీక్షితులు, రోహిత్ దీక్షితులు మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా స్వామివారి నవమ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించి స్వామివారి బ్రహ్మోత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు చిన్ని చెంచురత్నం, వర్దిరెడ్డి శివారెడ్డి, జె.అరుణమ్మ, మహేశ్వరి, సుజాత, రమణమ్మ, ఆలయ సిబ్బంది సాంబయ్య, రాజు, కొండయ్యతో పాటు చిన్ని సురేష్ బాబు, జయరామిరెడ్డి, బిజ్జం రమణారెడ్డి, రాఘవరెడ్డితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పరితపించే చేతుల ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం

**– పథకాల సారథులు వాలంటీర్లు**

**– సీఎం జగన్ వాలంటరీ వ్యవస్థ ప్రతి ఇంటికి మంచి జరుగుతుంది**

**– వాలంటీర్లకు పురస్కారాల ప్రదానంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి**

**లక్కిరెడ్డిపల్లె, మే 25, ప్రభాతవార్త:**

ప్రజల కోసం పరితపించే చేతల ప్రభుత్వం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వమని వైఎస్ఆర్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం పీజీఆర్ కల్యాణమండపంలో లక్కిరెడ్డిపల్లె మండలంలోని సచివాలయ వాలంటీరకు పురస్కారాల ప్రదానంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రథ సారథులు, వారధులు, గ్రామ, వార్డు వాలంటీర్లన్నారు. ప్రభుత్వం అందిస్తున్న 25 రకాల సంక్షేమ పథకాలను బ్రాండ్ అంబాసిడర్లు వాలంటీర్లు అని తెలిపారు. సీఎం జగన్ తెచ్చిన వాలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ వ్యవస్థతో ప్రతి ఇంట్లో మంచి జరిగిందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల నాయకుడిగా గొప్ప పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న సీఎం జగన్‌పై గుంట నక్కలు, తోడేళ్ల ఏకమై తప్పుడు ప్రచారం చేస్తున్న కొన్ని పత్రికలు, ఛానళ్లను అసలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆ ప్రచారాలను వాలంటీర్లు, కార్యకర్తలు తిప్పి కొట్టాలన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ప్రతి పథకం ప్రజలకు ఎంతో మేలు జరిగేవని ప్రతిపక్షానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వాటిపై మంచివి కాదని చెప్పే ధైర్యం లేదన్నారు. రాయచోటి నియోజకవర్గంలో రూ.30లక్షల సొంత డబ్బులతో ఆనందయ్య మందును వాలంటీర్ల ద్వారా ఇంటింటికి పంపించిన విషయాన్ని గుర్తు చేశారు.

**వాలంటీర్లకు కుటుంబ సభ్యుడివలే తోడుగా ఉంటా...**

వాలంటీర్లకు తాను కుటుంబ సభ్యుడు వలే తోడుగా ఉంటానని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో వాలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అందించి ప్రజల మన్ననలను పొందాలన్నారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్త, నాయకులకకు లేని గౌరవం, విలువలు వాలంటీర్లకు ఇస్తున్నారన్న విషయాన్ని వాలంటీర్లు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు వెంకట నారాయణరెడ్డి, గడ్డం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు నాయుడు, ఉప సర్పంచ్‌లు రాజారెడ్డి, సంజీవరెడ్డి, రఫీ, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, కొండా ప్రసాద్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు రామ్మోహన్ శెట్టి, మైనార్టీ నాయకులు చాన్‌బాషా, జాకీర్ సాహెబ్, నబీ బాబ్‌జాన్, బీసీ సెల్ విజయ్ భాస్కర్, వైసీపీ నాయకులు గజేంద్రరెడ్డి, గ్రామ వార్డు వాలంటీర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టి.బి.వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

**– డాక్టర్ స్రవంతి రెడ్డి**

**గాలివీడు, మే 25ప్రభాతవార్త:**



టిబి వ్యాధికి గురికాకుండా ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటించాలని నులివీడు పిహెచ్‌సి వైద్యాధికారిణి స్రవంతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నులివీడు ప్రభుత్వ వైద్యాశాలలో సీనియర్ అసిస్టెంట్ ఎస్టీఎన్ ప్రసాద్ సౌజన్యంతో వారి తండ్రి జ్ఞాపకార్థం 4 వేల రూపాయలు విలువ జేసే నిత్యావసర సరుకులను టిబి వా ్యధిగ్రస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఏ.వి. మహమ్మద్, ఫార్మాసిస్ట్ జోష్న, శారదా, మల్లీశ్ వ్రి, టిబి సూపర్వైజర్ హరి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలి



**రాయచోటి టౌన్, మే 25ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అయిన తొమ్మిదింటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నమయ్య జిల్లా ఎపిజిఈఏ అధ్య క్షుడు వై. శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొని ఆయన ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికీ ప్రతినెల 1వ తేదీన జీతభత్యాలు చెల్లించేలా చట్టం తీసుకురావాలని, అలాగే చట్టం ఆమోదించని సిపిఎస్ రద్దు పరిచి ఓపిఎస్‌ను పునరుద్దరించాలన్నారు. ఇప్పటికైనా ఉదో ్యగులకు న్యాయం చేయాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో తాలుకా అధ్యక్షుడు సాయికు మార్, కార్యదర్శి నరసింహులు, సుధాకర్‌రాజు, మహేశ్వర్‌రాజు, రెడ్డినాయక్, రవీంద్రనాథ్ వివేకానంద తదితరులుపాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలు రకాల ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# అత్యుత్తమ ప్రతిభ చూపిన జిఎంఎస్‌కె కె.మేరీ సుష్మను అభినందించిన జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

**రాయచోటి, మే 25ప్రభాతవార్త:**

అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జిఎంఎస్‌కె కె. మేరీ సుష్మని గురువారం అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్ రావు అభినందించారు. అరుణాచల్ ప్రదేశ్‌లో ఈనెల 20 నుండి 21 వరకు జరిగిన రెండవ నేషనల్ ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్, 2023 పోటీల్లో అన్నమయ్య జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన కె. మేరీ సుష్మ మహిళా పోలీసు (దేవళంపేట సచివాలయం చిన్నమండెం మండలం) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సత్తాచాటి సీనియర్ మహిళా విభాగంలో కాంస్య పతకంను సాధించారు. సబ్ జూనియర్ కేటగిరిలో వై. క్రిష్టియన్, టి. జెనీఫర్ సులోచన ఇరువురు కాంస్య పతకాలను సాధించారు. వారు సాధించిన కాంస్య పతకాలను జిల్లా ఎస్పీ గంగాధర్ అందించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్‌రావు మాట్లాడుతూ జిల్లా పోలీసు సిబ్బంది ఇంటర్ నేషనల్ స్థాయిలో తమ ప్రతిభ ప్రదరి ్శంచి జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించారని అభినందించారు. మున్ముందు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

# అసాంఘీక కార్యక్రమాలపై నిఘా పెంచండి

**– డిఎస్పీ మహబూబ్ బాషా**

**గాలివీడు, మే 25ప్రభాతవార్త:**



అసాంఘీక కార్యక్రమాలపై నిఘా పెంచాలని రాయచోటి డిఎస్పీ మహబూబ్‌బాషా పోలీసు సిబ్బందికి సూచించారు. గురువారం గాలివీడు పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్, పేకాట, క్రికెట్ బెట్టింగ్, ఆన్లైన్ బెట్టింగ్‌కు పాల్పడే వారిపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వెంకట శివకుమార్‌ను ఆదేశించారు. బస్టాండ్ ఆవరణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గంగమ్మా చల్లంగా చూడమ్మా

**రైల్వేకోడూరు రూరల్, మే 25 ప్రభాతవార్త**



గంగమ్మా చల్లంగా చూడమ్మా అంటూ రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అంబద్కేర్‌నగర్ జాతరలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గంగమ్మ నియోజకవర్గ ప్రజలను చల్లంగా చూడమ్మా అని ఆమె కు మొక్కులు చెల్లించుకున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టౌను అధ్యక్షులు రాజగోపాల్, హ్యూమన్‌రైట్స్ అధినేత ఇరుగూరి సుబ్బారావు, రమణ, కళ్యాణ్‌తో పాటు గంగమ్మ జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

# రాజంపేట మున్సిపాలిటి ప్రగతి రథం కదిలింది

**అమృత్ పథకం 30.12 కోట్లు మంజూరు**

**మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి వెల్లడి**

**రాజంపేట అర్బన్, మే 25 ప్రభాతవార్త**



రాజంపేట మున్సిపాలిటికి కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ ద్వారా నీటిసరఫరా మెరుగుపరిచేందుకు 30.12 కోట్ల నిధులు మంజూరైనట్లు మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ నిధులు మంచినీటి సరఫరాకు మాత్రమే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. 3వ విడత అమృత్ ప్రాజెక్టు ద్వారా ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. మొట్టమొదటిసారి అమృత్ పథకం ద్వారా నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రధాని మోడి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటుతో కలిపి 30 కోట్లు మంజూరైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిల సహకారంతో త్వరలోనే సిఎంను కలిసి హామీ ఇచ్చిన మేరకు 100 కోట్ల నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. అమృత్ పథకం ద్వారా నిధులు మంజూరు కావడంలో మున్సిపల్ ప్రజారోగ్య శాఖ అనంతపూర్ ఎస్ఇ శ్రీనాథ్‌రెడ్డి ఎంతో సహకరించారని పేర్కొన్నారు. త్వరలోనే మున్సిపల్ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి మంజూరైన 30 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు డిపిఆర్ సిద్ధం చేసి ఆమోదం తెలపడంతోపాటు ఐదేళ్ల పాటు 31 కోట్ల నిధులతో చేపట్టిన పథకాన్ని మున్సిపాల్టీనే నిర్వహించేలా తీర్మానించేందుకు నిర్ణయించామన్నారు. మున్సిపాలిటి పరిధిలో నీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఈ నిధులు ఎంతో దోహదపడ్డాయన్నారు. ప్రజలు మున్సిపాలిటి అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్‌లు దొంకా సూరి, ఎస్.న్యామతుల్లా, ఖాజా, డీలర్ సుబ్బరామిరెడ్డి, పోలా సాయివైభవ్ పాల్గొన్నారు.

# ఘనంగా రమేష్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**రాయచోటి, మే 25 ప్రభాతవార్త:**



రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి అడ్వాన్స్ జన్మదిన వేడుకలను గురువారం తెలుగుదేశం పార్టీ కొత్త ఆఫీసు నందు కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈనెల 26న శుక్రవారం రమేష్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించాల్సి ఉండగా ఆయన మహానాడుకు వెళ్తుండడంతో కార్యకర్తలు గురువారం ఆయనను ఘనంగా సన్మానించి కేక్ కట్ చేశారు. జన్మదిన వేడుకలకు రాయచోటి పట్టణంలోని మైనార్టీ సోదరులు, గాలివీడు లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు చెందిన తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి వతన్ నిసార్, ముబారక్, షబ్బీర్ పాల్గొన్నారు.

# అరటి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి

**ఓబులవారిపల్లె, మే 25, ప్రభాతవార్త:**



ఇటీవల కాలంలో ఓబులవారిపల్లె మండలం పెద్దఓరంపాడు పంచాయతీలో ముక్కావారిపల్లె, రాళ్ల చెరువుపల్లి, చిన్నఓరంపాడు తదితర పంచాయతీల్లో బుధవారం వీచిన పెను గాలులకు అరటి తోట నేలకొరిగింది. తీరా పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రతి ఏడాది రైతు నష్టపోవడం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా ప్రభుత్వం పండ్ల తోటల రైతులను ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని, అధికారులను రైతులు కోరుతున్నారు.

# క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్ల అరెస్టు

**పులివెందుల, మే 25, ప్రభాతవార్త :**



సింహాద్రిపురం మండలంలోని గురిజాల సర్కిల్‌లోని హైస్కూల్ లో బుధవారం రాత్రి క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారన్న సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రోషన్ తెలిపారు. వారి నుండి రూ.20100 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సింహాద్రిపురం మండలంలో ఎక్కడైనా మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలు ఏమైనా జరుగుతోంటే సమాచారం ఇవ్వాలని, అలాంటి వారికి నగదు బహుమతులు ఇస్తామని ఆయన తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

# అభివృద్ధి పనులపై సమీక్ష



**దువ్వూరు, మే 25, ప్రభాతవార్త:**

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవనంలో గురువారం మండల ప్రత్యేక అధికారి ఓబులేసు నందన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణం, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంపై చర్చించారు. ముఖ్యంగా గృహ నిర్మాణాలలో లక్ష్యాలు సాధించాలన్నారు. గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. స్పందన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు.ఈ సమీక్షలో తహసీల్దార్ రమాకుమారి, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏఈలు వీరారెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ వాలంటీర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం

**బద్వేలు రూరల్, మే 25 ప్రభాతవార్త :**



ప్రజా సమస్యలను ఇంటి వద్దకే వెళ్ళి గ్రామ వాలంటీర్ల సహకారంతో ప్రజలకు ఎనలేని సేవలందిస్తున్న గ్రామ వాలంటీర్లకు రాచపూడి నాగభూషణం కళ్యాణ మండపం నందు సన్మాన కార్యక్రమాన్ని ఎంపీడీవో రామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే డా॥ సుధ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏ రాష్ట్రంలో లేని విధంగా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించే విధంగా వాలంటీరు వ్యవస్థ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అటువంటి వాలంటీర్ల సేవలను గుర్తించి 5 మంది వాలంటీర్లకు ఒక్కొక్కరికి 20 వేల రూపాయలుతో పాటు సేవా రత్న అవార్డు, మెడల్స్, మరో 100 మంది వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డుతో పాటు ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు అకౌంట్‌లో జమ చేయడంతో పాటు ప్రశంసా పత్రం అందజేసి శాలువాలతో సత్కరించడం జరిగిందన్నారు. గత ఏ ప్రభుత్వంలో లేని విధంగా వైసీపీ పాలనలో ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు ప్రజలకు ఏ అవసరం వచ్చినా కూడా వారి సమస్యలను తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకుపోయి వారి సమస్యలను పరిష్కరించడంలో వాలంటీరు వ్యవస్థ ఎంతగానో కృషి చేస్తున్నారని, అనంతరం పలువురు వాలంటీర్లను వారు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపి రమణమ్మ, జడ్పీటీసి వంకెల చిన్న పోలిరెడ్డి, సర్పంచ్‌లు గంగమ్మ, నాగిపోగు ఓబులేసు, గాజులపల్లె నరసమ్మ, ఉప సర్పంచ్‌లు యం. రవి కుమార్ రెడ్డి, కుప్పాల వెంకట రమణ, మండల కో ఆప్షన్ మెంబర్ మహబూబ్ బాష, మాజీ మండల అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఈవోపిఆర్‌డి భాను ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బి.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# 250 మంది రైతులకు 5.48 కోట్లు నష్టం

**రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల**

**రైల్వేకోడూరు రూరల్, మే 25 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె, కోడూరు ప్రాంతాల్లో ఇటీవల ఆకస్మిక పెనుగాలులు, వర్షాలకు అరటి, బొప్పాయ పంటలు భారీఎత్తున నష్టం వాటిల్లాయని, వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్‌ను రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గురువారం సాయంత్రం కోరారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని రైతులు కష్టపడి అరటి, బొప్పాయ పంటలను సాగు చేసుకుంటే ప్రకృతి విలయతాండం చేసి ఉన్నపళంగా పంటనష్టం రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నష్టపోయిన 250 మంది రైతులకు ప్రభుత్వం నుండి 5.48 కోట్లు వెంటనే మంజూరు చేసి రైతులను ఆదు కోవాలని ఎమ్మెల్యే కలెక్టర్‌కు వివరించారు. పూర్తిస్థాయిలో రైతులను ఆదుకు నేవిధంగా కలెక్టర్ సహకరించాలని కోరినట్లు ఎమ్మెల్యే కొరముట్ల అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్‌డెవలప్‌మెంట్ ఛైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డితో పాటు రాజంపేట ఆర్‌డిఒ భాస్కర్, నియోజకవర్గ

# పరిపాలనా విప్లవానికి నాంది వాలంటీర్ వ్యవస్థ

**చిన్నమండెం, మే 25ప్రభాతవార్త:**



జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వాలంటీర్ వ్యవస్థ పరిపాలనలో ఒక గొప్ప విప్లవానికి నాందిగా నిలిచిందని వైఎస్సార్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నమండెంలోని ఎంపిడివో కార్యాలయం ఆవరణలో జరిగిన చిన్నమండెం మండలంలోని వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లుకు పురస్కార ప్రదానం కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను సిఎం జగన్ అందిస్తున్నారన్నారు. 2 వేలు జనాభా దాటిన ప్రతి గ్రామానికి సచివాలయాన్ని తీసుకొచ్చి పరిపాలనను సరళీకరించాలచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల నూతన భవనాలు, నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధి పనుల కళ్లకు కట్టినట్లుగా కనపడుతున్నాయన్నారు. ఒక రాయచోటి నియోజకవర్గంలోనే నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 14 కోట్లు నిధులు ప్రజలకు నేరుగా అందడం ఒక చరిత్ర అన్నారు. సిఎం జగన్ తీసుకువచ్చిన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని జడ్పీ మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఏజాస్ అలీఖాన్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, కోఆప్షన్ గౌస్ సాబ్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుకుక్క అంజనప్ప, సర ్పంచ్‌ల అధ్యక్షుడు ముసల్‌రెడ్డి, ఎంపిటిసిలు రమేష్, వెంకటప్ప నాయుడు, రెడ్డెప్ప, రమణ, శ్రీనివాసులు, నాగులయ్య, సర్పంచ్‌లు నజీర్ అహమ్మద్, శివారెడ్డి, పార్టీ నాయకులు, గ్రామ వాలంటీర్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీలో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి



**పులివెందుల రూరల్, మే 25, ప్రభాతవార్త :**

పులివెందులలోని జగనన్న కాలనీ ప్రారంభ సమయానికి కాలనీలో అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేయాలని పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పనులన్నింటినీ జాప్యం చేయకుండా నాణ్యంగా చేపట్టాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి, డీఈ సుభాష్ చంద్రబోస్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.